# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206
web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము
గూడూరి వెంకటరత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ ఎన్.రామతారక పరబ్రహ్మశాస్త్రి
మిస్.పి. ఇందిరాదేవి
జి.ఎన్.ఆర్. మూర్తి
డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు
డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 29 Issue 5
No.of Pages 40
JANUARY 2010

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... | .. రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా:
మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,


## ఈ సంచికలో.... పేజీ


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీఅభిభాషణ | 7 |
| సన్నిధిలోసంభాషణ | 9 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 11 |
| సత్సంగసౌరభం | 12 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 14 |
| సంకీర్తన, ధ్యానం | 16 |
| ఆంతరంగిక శాంతి అన్వేషణలో | 20 |
| గురుకృప | 24 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 26 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 28 |
| మాతాజీ బోధామృతం | 31 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 34 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 36 |
| సమర్థ సద్గురు నాధుని చరిత్ర | 38 |
| త్రికాలవేది బాబు | 41 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 43 |


**నూతన ఆంగ్ల సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో**

# భద్రవాక్యం

**శ్లో॥ కోఽహం కథమిదం జాతం కోవైకర్తాఽస్య విద్యతే ।**
**ఉపాదానం కిమస్తీహ విచార స్సోఽయమీదృశః ॥**

- అపరోక్షానుభూతి

అజ్ఞానం అనే ఆవరణ అడ్డుగా ఉన్నందున జీవుడు తన సహజ స్థితి అయిన నిత్యముక్త స్థితిని అనుభవించలేక, మోక్షం తన కన్నా ఇతరంగా ఉన్నదని అది సాధ్య వస్తువని భావించటం జరుగుతుంది. అజ్ఞానావరణ భంగం ఆత్మజ్ఞానం వలననే సాధ్యం. ఆత్మజ్ఞాన ప్రకాశం అనుభవానికి రావాలంటే బ్రహ్మ విచారణ చెయ్యాలి. సాధన చతుష్టయసంపన్నుడైన అధికారి మాత్రమే ఈ వేదాంత విచారణ చేయటానికి అర్హుడు.

ప్రతివారికీ ఈమాత్రం ఊహ ఉంటుంది. ఈ జగత్తునంతా అనుభవిస్తున్నది తాను. అదే నేను లేదా అహం అనే పదాల లక్ష్యం. అలాగే తాను లేదా అహంతో తెలుసుకొనబడుతున్నది ఈ జగత్తు. ఇదే ఇదం శబ్ద వాచ్యం. మన శరీరము, మనస్సు, ఇంద్రియాలు వాటిని అవి తెలుసుకోవటంలేదు. అవి జడం. వీటికంటే భిన్నంగా ఉన్న అహం వీటిని తెలుసుకుంటున్నది కనుక, అవి కూడా ఇదం అనే జగత్తులో భాగమే. మరి తాను లేదా అహం ఎవరు? దృశ్యమానం అవుతున్న ఈ జగత్తు నిజంగా ఉనికి కలిగి ఉన్నదా? లేక ఎండమావులలాగ గంధర్వ నగరంలాగా నిజంగా లేకపోయినా కనిపిస్తున్నదా? లేక కుందేటి కొమ్ములాగ, వంధ్యాపుత్రుడు వలె అసలు లేనేలేదా?

కర్త అంటే తయారు చేసేవాడు, ఉపాధి లేదా ఒక వస్తువు తయారు కావటానికి అవసరమయ్యే ముడి పదార్థం, లేనిదే ఏ వస్తువూ తయారు కావటం లేదనేది అందరికీ అనుభవంలో ఉన్నదే. అందువలన ఈ జగత్తుకు ఒక కర్త, అలాగే ఈ జగత్తు తయారు కావటానికి ఒక ఉపాదానం అవసరం అని తెలుస్తున్నది. ఈ జగత్తుకి కర్త ఎవరు? అది ఏ ఉపాదానంతో సృష్టించబడింది? లేదా అహం అంటె ఎవరు? ఈ దృశ్యం ఎలా కనిపిస్తున్నది? దీనికి ఉపాదానం ఏమిటి? ఆధారం ఏమిటి? అనే ఈ ప్రశ్నలకు సమాధానం కోసం చేసే విచారణే ఆత్మవిచారము లేదా బ్రహ్మ విచారము.

ఇదం వాచ్యమైనవి మాత్రమే తెలుసుకోబడుతున్నాయి. అహం తెలుసుకొనబడటంలేదు. అది ఇదంవాచ్యమైనవాటికన్నా పరం, విలక్షణమైనది. అది దేనికీ విషయంకాదు. అదొక్కటే చైతన్యపూర్ణము, ఉనికి కలిగి ఉన్నది, దృశ్యం మిథ్య, అది ఏనాడూ లేనిదే అన్న స్వానుభూతియే ఈ విచారణ పరమార్థం. *

# అమ్మ ఆశీస్సులు

శ్రీగురుదేవుల పరమానుగ్రహంతో ధనుర్మాస కార్యక్రమాలు చూత వృక్ష ఛాయలో ఎంతో భవ్యంగా జరుగుతున్నాయి. ముందుగా సంకీర్తన, ఆ తరువాత తిరుప్పావై, ముకుందమాల, ఋషుల చరిత్ర, భాగవతాలను మనం రోజూ శ్రవణం చేస్తున్నాం. వీటిపై మనస్సు పెట్టి పాల్గొనే వారిలో విషయం ప్రవేశించదు.

కృష్ణ! త్వదీయ పద పంకజ పంజరాన్తం అద్యైవ మే విశతు మానస రాజహంసః।
ప్రాణ ప్రయాణ సమయే కఫ వాత పిత్తైః కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే॥

"హే కృష్ణా! మరణ సమయంలో కఫ వాత పిత్తాలు నా కంఠానికి అడ్డం పడుతుంటే అప్పుడు నిన్ను స్మరించగలనో లేనో! అందుకని ఇప్పుడే నా మనస్సు అనే రాజహంసను నీ పాద పద్మములు అనే పంజరంలో ప్రవేశించనియ్యి. అప్పుడు ప్రాణం పోయినా భయం లేదు. ఎందుకంటే నా మనస్సు నీ పాదాలపై నిలబడి ఉంటుంది కదా!" అని శ్రీ కులశేఖర మహారాజు ముకుందమాలలో శ్రీ కృష్ణుని ప్రార్థించారు. తిరుప్పావైలో గోపికామణులు శ్రీకృష్ణుణ్ణి పొందటానికే కదా కాత్యాయిని వ్రతం చేస్తున్నది. ఋషులు మునిపుంగవులు ఆ భగవద్దర్శనం కోసమే కదాతపస్సు చేసినది. ఆ తపః ఫలంగా వారు పొందిన అనుభూతిని మానవాళికి అందించి తరించే మార్గం చూపారు.

మనందరికి బాలకృష్ణుడంటేనే ఇష్టం. మరి ఆ బాలకృష్ణుడు దేవకి అష్టమ గర్భంగా ఆవిర్భవించగానే, భగవదాదేశానుసారంగా వసుదేవుడు నందవ్రజంలో యశోద వద్ద ఆ బిడ్డను ఉంచి, ఆమెకు పుట్టిన ఆడ శిశువును దేవకి వద్దకు చేర్చాడు. యశోదకు పుత్రోదయం అయింది అన్న వార్త తెలియగానే వ్రజాంగనలు అందరూ "యశోదమ్మ ఒక చిన్ని మగవానిని కన్నదట. రండి, రండి, రండర్రా! వెళ్ళి చూచివద్దాము అని ఆ చిన్ని బాలుని చూడటానికి బయలుదేరారు. చిన్నప్పుడే అనేక అద్భుత కార్యాలు చేశాడు ఆచిన్ని బాలుడు. పూతనను చంపాడు. శకటాసురుని సంహరించాడు. నాలుగేండ్ల ప్రాయంలోనే గోపబాలురతో కలిసి ఎన్నో దుడుకు పనులు చేయటం మొదలు పెట్టాడు. పొరుగిళ్ళలో దూరి పాలు వెన్నలు దొంగిలిస్తుంటే గోపికామణులందరు యశోదమ్మ వద్దకు వచ్చి "ఓయమ్మ! నీ కుమారుడు మా ఇండ్లలో జొరబడి పాలు పెరుగు దొంగిలించాడమ్మా!" అని మొర పెట్టుకొన్నారు. యశోదమ్మ ఎందుకమ్మా! ఊరికే అభాండాలువేస్తారు, నా బిడ్డడు నా ఇంటనే ఉన్నాడు అని 'కృష్ణా! అని పిలవగానే కళ్ళు నులుముకుంటూ 'పిలిచావా అమ్మా!' అంటూ బయటకు వచ్చాడు. ఇంకా ఏమేమి లీలలు చూపిస్తాడో భాగవత శ్రవణం చేసి తెలిసికొందాం.

2009 సంవత్సరానికి వీడుకోలు చెప్తూ 2010 ప్రవేశించింది. ఈ సందర్భంగా శ్రీ సద్గురు దేవులు భక్తులందరికీ Happy,Healthy, Wealthy, Worry free జీవనాన్ని, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములను, ఆయురారోగ్య ఐశ్వర్యములను ప్రసాదించెదరు గాక! గురు పాదుకలు అందరినీ సర్వదా కాపాడుగాక!

- మీ అమ్మ

# సంపాదకీయం

శ్రీ సద్గురు దేవుల దివ్య ఆశీస్సులతో శ్రీమాతాజీ భక్త సహితంగా, ఆస్ట్రేలియా, మెల్‌బోరన్ నగరంలో జరిగిన విశ్వమత మహాసభలలో పాల్గొని స్వదేశానికి తిరిగి వచ్చారు. అమ్మ ఆ సభలలో డిసెంబరు, 6,8 తేదీలలో తెలుగులో చేసిన అనుగ్రహ భాషణను, ఆంగ్లంలో అందించిన సందేశానికి తెలుగు సేతను ఈ సంచికలో ప్రచురిస్తున్నాము.

ఆశ్రమంలో ధనుర్మాస కార్యక్రమాలు చూతవృక్ష ఛాయలో ప్రారంభం అయి యథా విధిగా నడుస్తున్నాయి. డిసెంబరు 25వ తేదీనాడు క్రిస్మస్ సందర్భంగా సద్గురుదేవుల పాదపూజ జరిగింది. ఏసుక్రీస్తు మానవాళికి అందించిన సందేశాన్ని సుషుమ్న ప్రసాద వివరించారు. డిసెంబర్ 28వ తేదీనాడు ముక్కోటి ఏకాదశి సందర్భంగా గురుపూజ, సత్సంగ సమావేశము, భక్త సమారాధన జరిగాయి.

రాష్ట్రంలో చాల ప్రాంతాలు అల్లకల్లోల పరిస్థితులలో ఉన్నాయి. ప్రాంతీయ దురభిమానం ప్రజల ఆస్తులను ధ్వంసము చేయటమే కాక మన రాష్ట్ర సంపదను, జాతీయ సంపదను నాశనం చేస్తున్నది. ప్రజలలో ఆధ్యాత్మిక, అద్వైతభావన, భగవద్భక్తి చక్కగా లేనందువలననే ఇంత మారణహోమము, విధ్వంసక చర్యలు, హింసాకాండలు జరిగుతున్నాయి అనటంలో సందేహం లేదు. ఇప్పటికైనా ప్రజలు కళ్ళు తెరచి అసలు లోపం ఎక్కడ ఉందో గ్రహించి ఇతరులను విమర్శించటం, ఇతరుల ఆస్తులను ధ్వంసం చేయటం మొదలైనవి మానుకొని తమలోపాలను సరిదిద్దుకుంటే, పరహితం కోసం పాటుపడితే ఈ విరోధినామ సంవత్సరం, నూతన ఆంగ్ల సంవత్సరం అందరికీ శాంతిసౌఖ్యాలను అందించగలవనటంలో సందేహం లేదు.

ఆశ్రమంలో జరిగే పండుగలలో భక్తులు అసంఖ్యాకంగా ఆశ్రమానికి వచ్చే పండుగ భోగి పండుగ. జనవరి ది.13న శ్రీబాబూజీకి భోగిపళ్ళు పోస్తారు. శ్రీమాతాజీ స్వహస్తాలతో అందరికీ ప్రసాదించే భోగిపళ్ళు తీసుకొని అందరూ ఆయురారోగ్య ఐశ్వర్యవంతులయ్యేదరుగాక!

నూతన ఆంగ్లసంత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా శ్రీసద్గురు దేవుల దివ్య ఆశీస్సులు అందరిపై తప్పక వర్షిస్తూనే ఉంటాయి. ఆ ఆశీస్సులను స్వీకరించి అందరూ సుఖోపేతులయ్యేదరుగాక! *

- గౌరవ సంపాదకుడు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

అలా సాధించిన మహాత్ములెందరో ఉద్భవించిన మన భారత భూమిలో జన్మించటమే మన అదృష్టము. బుద్ధ భగవానుడు సత్యమును, అహింసను ప్రబోధించాడు. మానవుడు శాశ్వతానందంలో ఓలలాడటానికి అడ్డుగా ఉన్న అజ్ఞానాన్ని, పరస్పర ప్రేమకు అడ్డంగా ఉన్న ఈర్ష్య, అసూయ, క్రోధము, ద్వేషము మొదలైన నీచ భావాలను నిర్మూలనం చేశాడు. తోటి మానవులపైన ప్రేమను వర్షించగలగాలి. వారి ప్రేమను తాను జుర్రుకోవాలి. ఆప్యాయంగా పలకరిస్తే, హృదయాలు అతుక్కు



పోతాయి. అట్టి ప్రేమ వల్ల హృదయ పవిత్రత కలుగుతుంది. అపారము, అవ్యాజము అయిన భూతదయతో జీవకోట్ల హృదయాలను పవిత్రంగా మార్చి వేసిన మహనీయుడు, అమృత స్వరూపుడు బుద్ధ భగవానుడు. సత్యమునే పలుక వలెనని, జీవహింస చేయరాదని, ఎవరి మనసును నొప్పించరాదని, మనస్సుకు పెట్టే హింస శారీరక హింస కంటె బాధాకరమైనదని బుద్ధుడు చెప్పాడు. మన భారతీయ ధర్మము, మన వేదాలు యీ ముఖ్య సూత్రాలనే ప్రబోధిస్తున్నాయి.

ఏ ప్రతిఫలాన్ని కోరకుండానే చెట్లు మానవునికి, తనకు అపకారం చేయటానికి వచ్చిన వ్యక్తికైనా సరే, చల్లని నీడనిస్తున్నవి. మధురమైన ఫలాలనిస్తున్నవి, ప్రాణప్రదమైన గాలినిస్తున్నవి. తనను నరికివేసిన మానవునికి కూడా వంట చెరకు రూపంలో అవి ఉపకారమే చేస్తూ ఆత్మ సమర్పణ చేసుకుంటున్నవి. నదులు తమ జలాలతో జీవకోట్ల దాహాన్ని తీరుస్తున్నాయి. ఎన్నో చెట్లు, పశు పక్ష్యాదులు మొదలైన వాటికి జీవన శక్తినిస్తున్నాయి. సస్యాలు, ఓషధులు మొదలైన అమూల్య పోషక పదార్థాల పుట్టుకకు, పెరుగుదలకు మూలకారణమవుతున్నాయి. అందుకు ప్రతిఫలంగానదులు మానవుని నుండి ఏమి ఆశిస్తున్నాయి? మేఘాలు ఏ ప్రతిఫలం కోసం వర్షాలు కురిపిస్తున్నాయి? పర్వతాలు ఏ ప్రతిఫలాన్ని ఆశించి అమూల్య ఖనిజాలను, రత్న సంపదను మానవులకు అందిస్తున్నాయి? మన మనుగడకు మూలమైన మాతృ తల్లి భూదేవత, తనను దున్ని పంటలు పండించుకోమని, త్రవ్వి ఖనిజాలను, వెండి బంగారాల వంటి ఎన్నెన్నో అమూల్య వస్తువులను తీసుకుని అనుభవించమని

ఏ ప్రతిఫలం కోరి తనను తాను త్యాగం చేసుకుంటున్నది?

ఇలా సృష్టిలో, మన దృష్టిలో అల్పమైనవన్నీ, ప్రతిఫలాపేక్ష లేని త్యాగాన్ని బోధిస్తున్నాయే! త్యాగమొక్కటే మానవులకు అమృతత్వాన్ని ప్రసాదించగలదని వేదాలు ఘోషిస్తున్నాయే! మరి మానవుడు తన స్వార్థం కోసం పాషాణ హృదయుడై, తోటి మానవులకు ఏ సంకోచం లేకుండా ఎలా హాని చేయగలుగుతున్నాడు? బుద్ధ భగవానుడు బోధించినవి సత్యము, శాంతి, దయ, ప్రేమ అనే మూలసూత్రాలు. అవే మీ హృదయబాబు మీకూ అందిస్తున్నారు. మానవుని స్వార్థపరునిగా మార్చివేస్తున్న మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే నాలుగు అంతరింద్రియాలూ యీ నాలుగు పవిత్ర రూపాలుగా మారాలి. అంటే మనస్సు సత్యంగా, చిత్తము శాంతిగా, బుద్ధి దయగా, అహంకారము స్వార్థరహితమైన ప్రేమగా మారితేనే ప్రశాంతి కలుగుతుంది. ఆ ప్రశాంతిలోనే భగవానుడు నివసిస్తాడు. అలా ఆచరించిన మానవులు అందరికి ప్రేమపాత్రులవుతారు. సమం ఏకత్వం ; సమం బ్రహ్మ అనే మూలసూత్రాన్ని practical గా ఋజువు చేశాడు బుద్ధ భగవానుడు.

అశోక చక్రవర్తి తన చిన్నతనంలో విద్యాభ్యాసం చేస్తున్నపుడు సత్యము, శాంతి, దయ, ప్రేమ అన్నీ బోధించారు గురువులు. ఆ గురువులంతా ఆ మూల సూత్రాలను పాటించినవారే. వారే ఆ సూత్రాలను తమ విద్యార్థులకు బోధించారు. కనుకనే అశోకుడు మొదటిలో రాజ్య కాంక్ష కలిగి యుద్ధ ప్రియుడైనా, చిన్ననాడు నేర్చుకున్న సంస్కారం వలన, అహింసా పరమోధర్మః అనే సత్యాన్ని గుర్తించి ఆచరించి ఈనాటికీ మన జాతీయ పతాకంలో అశోక చక్రం రూపంలో ప్రకాశిస్తున్నాడు.

మరి యీనాడు భారతీయులందరు స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నారు. ఈనాడూ గురువులు "సత్య మార్గంలో ప్రవర్తించినప్పుడే మానవుడు ఉన్నత స్థితిని పొందుతాడు. భగవానుని ప్రేమకు పాత్రుడౌతాడు" అని బోధిస్తూనే ఉన్నారు. కాని.... కాని...? ఏమిటి యీ "కాని" కి అర్థం? చెప్పేవారూ, వినేవారూ కూడా స్వార్థరహితంగా, సత్యమార్గంలో మానవసేవ చెయ్యాలనే అంటున్నారు. అయినా ఎంతమంది ఆచరిస్తున్నారు? ఆచరణలో యీ పతనం ఎందువల్ల వచ్చింది? ప్రకటనల్లో, ప్రచారాల్లో, ప్రబోధాల్లో యీ సత్యాన్ని ఎంత ప్రస్ఫుటంగా ఉద్ఘాటిస్తున్నారో, ఆచరణ ఫలితాలను చూస్తే మాత్రం result అంత minus గా ఉంది. పాస్ మార్కులు రాకపోగా, మైనస్ మార్కులు వచ్చేవాళ్ళను ఏమనాలి?

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద

ఈ జీవితం బుద్బుదప్రాయమైనది. మహాత్ములు చెప్పినట్లుగా నడుచుకుంటే తప్పకుండా భగవంతుడిని తెలుసుకోవచ్చు. చూడవచ్చు. భగవంతుడిని చేరడానికి గృహస్థాశ్రమం బంధంకాదు. సంసారంలో మనం ఉండవచ్చు కానీ, మనలో సంసారం ఉండకూడదు.



కర్మలో అకర్మని చూసే మార్గాన్ని గురుదేవులు చెప్తారు. ఏ పని చేస్తున్నా మనలో నిరంతరం భగవన్నామం జరుగుతూఉంటే అప్పుడు మనం తామరాకుమీద నీటిబొట్టులాగా, ఈ సంసారంలోనే ఉన్నా, సంసారం మనకి అంటదు. అదే కర్మలో అకర్మ.

కనుక భగవన్నామం ఎంతో గొప్పది. మీరు ఆశ్రయించిన దేవుడే మీ సర్వస్వం అని నమ్మండి. మీలో భగవన్నామం మారుమ్రోగాలి. మీలో దాగివున్న అనంతశక్తిని భగవన్నామం ద్వారా మేల్కొలపండి.

## 4. అక్షరస్వరూపిణి - సరస్వతి

(06-02-2003న శ్రీ సరస్వతీ జయంతి సందర్భంగా, సత్తెనపల్లిలోని "శ్రీ సరస్వతీ శిశుమందిర్" వారి ఆహ్వానం మేరకు శ్రీమాతాజీ అచ్చటి పిల్లలకు అక్షరాభ్యాసాలు చేసి ఆశీర్వదించిన పిమ్మట, అచ్చటికి వచ్చిన భక్తులను, పిల్లలను, శిశుమందిర్ యాజమాన్యమును ఉద్దేశించి చేసిన అనుగ్రహ భాషణము.... ముందుగా శ్రీమాతాజీ "జయ జయ జయ గీర్వాణ సరస్వతి ప్రణవగాన విశారదే శారదే" అనే గీతమును పాడారు. ఆ తరువాత.......)

నాట్య, గాన, తాళ, లయలకి, సమస్త విద్యలకీ తల్లి జగజ్జనని సరస్వతీమాత. అటువంటి సరస్వతీదేవి యొక్క శిశుమందిరంలోని విద్యార్థులకు, అధ్యాపకులకు, స్త్రీమాతలకు, ఈ ఉత్సవాన్ని దర్శించడానికి వచ్చిన వారికి, అందరిలోనూ ప్రకాశించే చైతన్యానికి శిరసా ప్రణమిల్లుతూ, సద్గురు స్మరణతో మీ ముందు కొన్ని మాటలు చెప్పడానికి యిచటికి వచ్చాము.

"సత్తెనపల్లి" అంటే "సత్యానికే పల్లె". అటువంటి సత్తెనపల్లి గ్రామంలో యిటువంటి పాఠశాల ఉండటం మరింత శోభను తెచ్చిపెట్టింది! అందునా, సాక్షాత్ చదువుల తల్లియైన సరస్వతీదేవి పుట్టినరోజున యిటువంటి చక్కటి కార్యక్రమం చేసుకోవటం మరింత ఆనందదాయకం.

చిన్నతనంలో నేర్చినదే, పెద్దయ్యాక ఉపయోగపడుతుందనేది అక్షరసత్యం. అందులో, మన భారతావనిలో యింకా కొంచెం పాతకాలపు విలువలుండటం బట్టి, ఏదో కొంచమైనా అది నిలచివుంది. కానీ, ఏనాడయితే ఆంగ్లేయులు మనదేశానికి వచ్చారో, ఆనాటి నుండి, మనవాళ్ళు మన భారతీయ సంస్కృతిని మరచిపోయి, ఇంగ్లీషు మాటా, ఇంగ్లీషు పాటా అనుకుంటూ, ఇంగ్లీషు వారిని అనుకరించడం మొదలు పెట్టారు. వారిలోని మంచిని నేర్చుకుంటే ఫరవాలేదు. కానీ అలాకాకుండా మన దేశంలోని మంచిని వదిలేసి, వారిలోని చెడుని అలవరచుకొని, ఎందుకూ పనికి రాకుండా పతనమయిపోతున్నారు నేటి యువత. ఇతరదేశాల ప్రభావం మనదేశంలో ఎక్కువైపోయిన ఈ రోజులలో 25,000 శిశుమందిరాలు ఉండడమే కాక, ఇంత శాస్త్రబద్ధంగా పూజ చేయించి, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కూడాఎంతో చక్కగా జరిపించడమనేది చాలా ఆనందదాయకమైన విషయం.

అక్షరాలు సరస్వతీమతల్లి నుండి వచ్చాయి. 'రసోవైసః' అని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. కనుక, రస స్వరూపిణియైన సా-రస-వతి-సరస్వతీదేవి నుండి వచ్చిన అక్షరములు నిజంగా క్షరము అంటే నాశనము లేనటువంటివే. అంటే ఆ జగజ్జనని ప్రసాదించే అక్షరములు కేవలం ఈ లౌకిక చదువులకి సంబంధించినవి మాత్రమే కావు. "ఏత్వక్షరమ్। అనిర్దేశ్యమ్। అవ్యక్తమ్..." అని ఏ నిర్గుణతత్త్వం గురించి గీతాచార్యుడు భగవద్గీతలో చెప్పారో, అటువంటి నాశరహితమైన, అవ్యక్తమైన, పరమాత్మతత్వాన్ని గురించి చెప్పే అక్షరాలని కూడా ప్రసాదించేది కనుకనే, ఆవిడని "ప్రణవగాన విశారదే శారదే" అని యింతకు ముందు కీర్తించుకున్నాము. ప్రణవగానంలో ఆవిడ విశారద! కనుక ఆధ్యాత్మిక పురోభివృద్ధికి కూడా సరస్వతీ ఉపాసన చాలా ముఖ్యం. ఒక్కసారి అభ్యసిస్తేనే ఎన్నో అక్షరాలు మననుండి వస్తున్నాయే - మరి నిరంతర అభ్యాసం యింకెంత పనిచేస్తుందో ఆలోచించండి!

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

'ఈ ప్రపంచం అంతా మనం అనుభవించడానికే గాని లేకపోతే ఎందుకు? ఎ.సి. ఎందుకు? ఫ్రిజ్ ఎందుకు? ఫాన్ ఎందుకు? పరుపులెందుకు? ఇవన్నీ మనం అనుభవించడానికేగా ఏర్పడింది?' అలా సంభాషణ చేస్తూ ఆ వ్యక్తి బలహీనుడై పడిపోయాడు. శక్తిహీనుడైన స్థితిలో ఎక్కడో జన్మసంస్కారం బాగుండబట్టి భగవంతుడు అనుగ్రహించాడు. అనుకూలవతియైన భార్య దొరికింది. ఎవరో ఎందుకు? మీ విషయం చెప్పండి. మీరు యౌవనంలో ఉండగా ఎంతమందిని విమర్శించలేదు? ఇంత వయస్సు వచ్చిన తరువాత కదా స్టాండర్డ్ అవుదామని ప్రయత్నిస్తున్నారు. మానవుడు ఇటువంటి భావాలతో ఉండి నాకు వేంకటేశ్వరస్వామి దర్శనం కాలేదు! కాలేదు! అంటే ఎలా అవుతుంది? యౌవనంలో మానవుని దృష్టి విషయాదుల పైననే ఉండటం సహజమే! ఎందువలన అంటే మనస్సు ఇంద్రియాలకు బానిసయి ఉంటుంది. దీనిని **జీవదృష్టి** లేదా **దేహదృష్టి** అంటారు. వీటి నుంచి రక్షించేదే **గురులక్ష్యార్థం**.

ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. మీరంతా సాధారణంగా అద్దంలో చూసుకుని మీ ముఖంలో ఉండే తప్పులను సరిదిద్దుకుంటారు కదా! అలాగే గురులక్ష్యార్థమనే అద్దంలో చూసుకుని మీ తప్పులను సరిదిద్దుకోవాలి. మీ మనస్సు అద్దం లాంటిది. అది పరిశుద్ధంగా ఉండాలి. ఒక అద్దం ఉందనుకోండి. దానికి మసి ఉంటే వస్తుదర్శనం అవదు కదా! ఆ మకిలి తొలగించినప్పుడు వస్తుదర్శనం అవుతుంది. అలాగే నీ మనస్సుకు ఉన్న మకిలిని తొలగించాలి. అప్పుడే మనస్సు లక్ష్యార్థంపై నిలబడి వెలుగును చూడగలుగుతావు'.

ఇంతలో తారకంగారు తనకు వచ్చిన స్వప్నం గురించి శ్రీబాబుకు వివరించారు. ఒక స్వప్నం గురించి చెబుతూ 'ఒక సూర్యబింబం చుట్టూ నాలుగు రింగులు ఉన్నట్లు గోచరించింది బాబూ!' అని చెప్పారు.

శ్రీబాబు మాట్లాడుతూ 'మీ నాన్నగారు సూర్యోపాసకులు కదా! మీకు కూడా సూర్య నమస్కారాలు చేసే అలవాటుంది! అందుచేత సూర్య నారాయణమూర్తి అనుగ్రహించి మీకు ఒక సూచన చేశాడు. మీకు సూర్య నారాయణమూర్తి దర్శనం అవ్వాలంటే మీ చుట్టూ ఉన్న మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే నాలుగు ఆవరణలు దాటితే పొందగలుగుతారు అన్నట్లుగా ఉంది. దీనినే **ఆదిత్యవిద్య** అంటారు' అని చెప్పారు.

తారకంగారు రెండవ స్వప్నాన్ని గురించి చెబుతూ 'శివానందమూర్తి గారు శివలింగము, శ్రీచక్రము నాకు ఇస్తున్నట్లుగా కల వచ్చింది. సర్వ వ్యాప్తంగా ఉన్న ఆత్మవస్తువు ఒక్కటే అన్న విషయాన్ని తెలియజేస్తున్నట్లుగా ఉన్నది అని నేను భావిస్తున్నాను' అని అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ 'మానవ జన్మ ఎత్తినందుకు ఆత్మానుభూతి పొందాలన్నా, మోక్షసామ్రాజ్యాన్ని అధిష్ఠించాలన్నా విశ్వాసం లేనిదే సాధ్యపడదు. విశ్వాసం ద్వారా, భక్తి ద్వారా జ్ఞానం పొందవచ్చు. మరి వ్యభిచార భక్తి ఉంటే గురు లక్ష్యార్థాన్ని ఎలా సాధించగలుగుతాడు? వాడి విశ్వాసం చిల్లుకుండలాగా ఉంటుంది. అటువంటి కుండలో నీరు నిలవమంటే ఎలా నిలుస్తుంది?

అట్టి మానవుడికే సందేహాలు కలుగుతాయి. అచంచల విశ్వాసం ఉన్నవాడికి సందేహాలు ఎందుకు వస్తాయి? పతివ్రతా స్త్రీ తన భర్త పరదేశంలో ఉన్నా, పరాయి మొగాడివంక కన్నెత్తి కూడా చూడదు కదా! అట్టి అచంచల భక్తి గురుదేవుని యందు కలిగి ఉండాలి. దానినే **ఏకాగ్ర దృష్టి** అంటారు. తల్లి తనపిల్లలకెప్పుడైనా విషమిస్తుందా? అలాగే తనను ఆశ్రయించిన వారికి గురుదేవుడు ఎన్నడైనా లోటు చేస్తాడా? అట్టి గురుదేవుని యందు విశ్వాసం లోపిస్తే ఆ తప్పు ఎవరిది?' అని అన్నారు.

**10-3-1985**

శ్రీబాబు ఈరోజు రాత్రి భక్తులకు బోధచేస్తూ 'మానవుడు ఏదైనా సాధించాలి అంటే అన్నింటికన్నా ముఖ్యమైనది ఏది?' అని ప్రశ్నించారు. భక్తులంతా సమాధానం చెబుతూ భక్తి ఆవశ్యకము అని ఒకరు, విశ్వాసము అని మరొకరు, వైరాగ్యం అని ఇంకొకరు, త్యాగమని వేరొకరు చెప్పారు. శ్రీబాబు మాట్లాడుతూ 'మీరు చెప్పినవన్నీ యథార్థమే కాని ముందుగా అంతకన్న ముఖ్యమైనది ఒకటి ఉన్నది. అది లోపిస్తే మీరు చెప్పినవాటిలో ఏ ఒక్కదాన్ని సాధించలేరు. మానవుడికి ఏ పని సాధించాలన్నా శ్రద్ధ లేక క్రమశిక్షణ అవశ్యకము. అది లోపించబట్టే మీరు సాధన సక్రమంగా చేయలేక పోతున్నారు. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం అని శ్రీకృష్ణపరమాత్మ అర్జునుడికి బోధించాడు. శ్రద్ధ ఉన్నప్పుడే విశ్వాసం బలపడుతుంది. భక్తి కలుగుతుంది. త్యాగం చేయగలుగుతాము. అప్పుడు నీ బాధ్యతని గుర్తించ గలుగుతావు. ఈ ఆశ్రమం నాది అని బాధ్యతగా ప్రవర్తిస్తావు. ఏ త్యాగానికైనా సిద్ధపడతావు. ఎన్ని అవాంతరాలు వచ్చినా గురుదేవుడు ఎంత పరీక్షించినా ఆ పరీక్షలో నీవే నెగ్గుతావు. నీలో కొన్ని లోటుపాట్లు ఉండవచ్చు. అవన్నీ తొలగించుకో గలుగుతావు. శ్రద్ధ విశ్వాసము ద్వారా గురువాక్య పాలన చేయగలగుతావు' అన్నారు.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

### జనవరి 2010

| | | |
|---|---|---|
| 1 | శుక్ర | ఆంగ్ల సంవత్సరాది, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. |
| 9 | శని | శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. |
| 13 | బుధ | మాస శివరాత్రి, భోగి, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన, రాత్రి 8 గం.లకు భోగి పళ్ళు పోయుట. |
| 14 | గురు | మకర సంక్రాంతి,శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. |
| 15 | శుక్ర | అమావాస్య, కనుమ, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన, సూర్య గ్రహణం, స్పర్శ ఉ 11గం 38ని - మోక్షం 15గం20ని. |
| 22 | శుక్ర | రథ సప్తమి |
| 26 | మంగళ | భీష్మ ఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ. సత్సంగం, పెద నింద్రకొలను బ్రాంచిలో శ్రీ గురుదేవుల దివ్య మంగళమూర్తి ప్రతిష్ఠా షష్ఠమ వార్షికోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన |
| 30 | శని | మాఘ పూర్ణిమ,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన. |

### ఫిబ్రవరి 2010

| | | |
|---|---|---|
| 8 | సోమ | శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 12 | శుక్ర | మహా శివరాత్రి, తె.ఝా. 3 గం.లకు బృందావనంలో శ్రీ గురుదేవులకు రుద్ర,నమక, చమక సహితంగా అభిషేకం 4 గం.లకు మహన్యాసము, 5గం.30 నిలకు శ్రీ సద్గురు పాదపూజ, 7గం.30 నిలకు సామూహిక రుద్రాభిషేకములు, 11గం.లనుండి శ్రీ రామలింగేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన, రాత్రి 6.గం. 30ని.లకు శ్రీ మహాకాళికాపరమేశ్వరీ రామలింగేశ్వరుల నగరోత్సవము రాత్రి7గం.30ని.లకు లీలా కళ్యాణము. |
| 17 | బుధ | శ్రీ లలితానంద సరస్వతి స్వామినివారి పుణ్యారాధన మహోత్సవము,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, ఆరాధన కార్యక్రమము. |
| 28 | ఆది | పూర్ణిమ, హోలీ, శ్రీ సద్గురు పాదపూజ. |

# సత్సంగ సౌరభం

(గతసంచిక తరువాయి) -శివ ప్రసాద్

**ఒరు లేయవి యొనరించిన । నరవరయప్రియము తన మనంబున కగుతా**
**నొరుల కవి చేయకుండుట । పరాయణము పరమ ధర్మముల కిలన్**

(- భారతము)

ఇలా మనం ధర్మాన్ని రక్షిస్తే, అంటే ధర్మాన్ని చక్కగా ఆచరిస్తే, ఆ ధర్మం మనను రక్షిస్తుంది. మనం ఇతరులకు ఉపకారం చేస్తే వారు మనకు ఉపకారం చేస్తారు. మనం అపకారం చేస్తే వాళ్ళూ అపకారం చేస్తారు. ఇప్పుడు వెంటనే చేయలేకపోతే తరువాత చేస్తారు.

మనం రోజూ ఉదయమూ, సాయంత్రమూ మన ప్రార్థనలో 'అవ్యాజ కరుణామూర్తీ! తను మన ధనములతో సదా ఇతరులకు మంచినే చేయుటకును, ఇతరులయందు మంచినే చూచుటకును, మంచినే గ్రహించుటకును తగిన సద్బుద్ధిని మాకు దయసేయుము' అని అంటున్నాము. అంటున్నాము, వింటున్నాము కాని భావన చేస్తున్నామో లేదో! అందులో ముఖ్యమైనది 'సద్బుద్ధిని దయచేయుము' అనేది. ఆ బుద్ధిని అనుగ్రహించి, వారికి బ్రహ్మానందాన్ని ప్రసాదించేవాడు శ్రీ రామచంద్రుడు. శాంతులలోకెల్ల గొప్ప శాంతి, పరమ శాంతి లభించాలి అంటే మనస్సును శుభ్రంగా ఉంచుకొని గురువును ఆశ్రయించిన వారికే అది లభిస్తుంది. మనస్సు సహజంగా చంచలమైనది.

**చంచలం హి మనం కృష్ణ ప్రమాది బలవద్దృఢం**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరం ॥** (- భగవద్గీత)

అంటాడు అర్జునుడు. మనస్సు పరమ చంచలమైనది. దానిని నిగ్రహించాలంటే గాలిని మూటకట్టటం ఎంత కష్టమో అంత కష్టం. మరి ఏం చెయ్యాలి? అంటే శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో చెపుతాడు

**అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలం**
**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥** (- భగవద్గీత)

అని. ఏది కావాలో దానిని మళ్ళీ మళ్ళీ చెయ్యటం వైరాగ్యం. చెరుపు చేసేదానిని విడిచి పెట్టటానికి చేసేది అభ్యాసం. ఈ విషయాన్ని బోధ చేసి, తాను ఆచరించటమేకాక, ఇతరులతో ఆచరింప చేసి దాని అనుభవాన్ని కలుగ

చేస్తాడు కనుకనే గురువు ఆచార్యుడు అయినాడు. గురువు ఎటువంటి వాడు? ఎవరిని ఉపాసించాలి? అంటే సర్వ శరీరస్థ చైతన్య ప్రాపకో గురురుపాస్య అని నిరాలంబోపనిషత్తు. అందుకే గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ అన్నారు. న గురోరధికం న గురోరధికం అని సాక్షాత్తూ శివుడు పార్వతికి చెప్పిన గురుగీతలో ఉన్నది. రామచంద్రుణ్ణి గురించి సీతమ్మ ఆంజనేయుడికి రాముడు నరుడని, దశరథ రాముడని అనుకుంటున్నావేమో. అతడు నిర్వికారుడు, నిరంజనుడు, అంతరా రాముడు అని చెప్తుంది.

అందువలన మార్గం ఏమిటంటే, దక్షిణామూర్తి స్తోత్రంలో చెప్పబడినట్లు తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే. దక్షిణా అంటే బుద్ధి. బుద్ధిర్మనీషా ధిషణా ధీః ప్రజ్ఞా శేముషీమతిః (అమరకోశము). మనం గురుదేవుడికి ఆ దక్షిణను అంటే బుద్ధిని సమర్పించాలి. గురువుకు ఆ బుద్ధిని సమర్పిస్తే, ఆయన దానికి ఆనందాన్ని ప్రసాదిస్తాడు. శుద్ధమైన పళ్ళెం అయితేనే అందులో ప్రసాదం పెడతారు. అలాగే శుద్ధమైన బుద్ధిని ఆయనకు సమర్పిస్తే దానికి శాశ్వతమైన ఆనందాన్ని ప్రసాదిస్తాడు రామచంద్రుడు. రోజూ 2గంటలు, అలా వీలుకాకపోతే కనీసం ఒక గంటైనా వారికి సమర్పించాలి. టైము లేదని డబ్బులు ఖర్చు పెడితే శాంతి లభించదు. బుద్ధిని శాంతంగా ఉంచటం సాధన చెయ్యాలి. అలా చేయటమే విచారణ మార్గం. దానికి మనకు గురుదేవులు 9 సాధన మార్గాలు చెప్పారు. మనం ఎంత ఆచరిస్తే అంత వస్తుంది. పిండి కొలది రొట్టె. ఎంత త్యాగం చేస్తే అంత శాంతి వస్తుంది. మహాత్ముల వద్ద విన్నది ఆచరిస్తే శాంతి వస్తుంది. *

జనవరి 18,19,20 తేదీలలో చిన్నమంగళాపురం, పాలకొండ మండలం, శ్రీకాకుళం జిల్లాలో **శ్రీమాతాజీవారి తృతీయ సత్సంగ మహోత్సవములు** భక్తులు అయిన శ్రీ బంకి లక్ష్మణమూర్తిగారి ఆధ్వర్యంలో జరుగుతాయి. భక్తులందరూ ఈ అవకాశమును సద్వినియోగ పరచుకోగలరు. ఉదయం: సుప్రభాతం, ధ్యానం, ప్రార్థన, సంకీర్తన, తీర్థప్రసాదాలు, సాయంత్రం: సంకీర్తన, శ్రీ మాతాజీ బోధామృతం. 20వ తేదీ ఉదయం !1 గంటలకు శ్రీ సద్గురు పాద పూజ

బంకి లక్ష్మణమూర్తి ఫోన్ నెం : 08941 - 220005:237851
సెల్ నెం :9573580309:9396592276

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

వృద్ధుడు తడబాటుతో 'మళ్ళీ ఎత్తైనచోటే పెట్టినట్లున్నావు కదయ్యా! ఎమిటో కాస్త సరిగ్గా చూడు' అన్నాడు. నామదేవుడు కంగు తిన్నాడు. తీరా చూస్తే ఇందాక తాను అతని పాదాలు పెట్టిన చోట ఒక శివలింగం ఉన్నది. అంతే కాదు ఇప్పుడు కూడ అతని కాళ్ళ క్రింద శివలింగం ఉన్నది. చూస్తూ ఉండగానే ఆ వృద్ధుని నాలుగువైపులా నాలుగు శివలింగాలు. నామదేవుడు దిఙ్మూఢుడై ఆ పాదాలు అలాగే పట్టుకుని నిల్చున్నాడు. ఆ పాద స్పర్శతో నామదేవుడికి ఏదో ఒక అభౌమమైన ఆనందం కలిగింది. అతడికి శరీర స్పృహ లేదు. మనస్సు ఏదో ఆనందలోకాలలో విహరిస్తూ ప్రపంచాన్ని మరచి పోయింది.

**వృ -** ఎంతసేపని కుళ్ళి చీము, రసి, రక్తము కారుతున్న ఆ పాదాలు పట్టుకుని అలా నిల్చుంటావు. త్వరగా శివలింగం లేనిచోట పెట్టుబాబూ! బాగా నొప్పిగా ఉన్నాయి కాళ్ళు.

నామా ఆలోచిస్తున్నాడు. అంటే దేవుడులేని చోట పాదాలు ఉంచు అంటున్నాడు ఆ వృద్ధుడు. కాని దేవుడు అంతటా నిండి ఉన్నాడు. నీటిలో, భూమిపై, అగ్నిలో, పాషాణంలో అంతటా ఆ గుర్తులే అని నివృత్తిదేవ మహరాజ్ చెప్పలేదా? హరితప్ప నాకేమి కనబడటం లేదు అనేకదా జ్ఞానదేవుడు అన్నాడు. జపము, తపము, కర్మ, క్రియ, ధర్మం అన్నింటిలో ఆ రాముడే అని పాండురంగడు బోధించాడు కాదా? ఇంతవరకు తాను వాటిని వినటం మాత్రమే జరిగింది. కాని..... కాని.... ఈరోజు ఎక్కడ ఆ వృద్ధుడి పాదం మోపితే ఆక్కడల్లా శివలింగం ఉద్భవించి, అవి అన్నీ సత్యం అన్న అనుభవం కలుగుతున్నది. ఓహ్! ఎంత అద్భుతం! ఇదేమిటి నాలోని అహంకారం పూర్తిగా నశించింది! కొంపదీసి, నాకు ఈ దివ్యానుభూతి కలగటం కల కాదు కదా! సందేహం లేదు! ఇది తప్పక ఈ పాదాల మహిమే. నిశ్చయంగా ఈయనే ముమ్మాటికి నా గురుదేవులు. ఇన్నాళ్ళ నా నిరీక్షణ ఫలించి, నా ఆవేదనను తపనను తీర్చటానికి నా గురుదేవులే ఈ రూపంలో నన్ను అనుగ్రహిస్తున్నారు. ఇక ఈ గురుపాద సన్నిధిని ఎట్టి పరిస్థితులలోను వదులుకోను. నామదేవుడు క్రింద కూర్చుని ఆ వృద్ధుని పాదాలను రెంటిని మెల్లగా, జాగ్రత్తగా, రెండు

మల్లెపూలను ఉంచుకున్నట్లు తన ఒడిలో పెట్టుకున్నాడు. ఇవే తాను ఇన్నాళ్ళుగా వెతుకుతున్న ఆ దివ్య పాదాలు అని అతడి హృదయానికి తెలిసిపోయింది. అతడు ఆ పాదాలను మృదువుగా, నెమ్మదిగా, ఎక్కడ బాధ కలుగుతుందో అన్నట్లు మెల్లగా ఒత్తుతున్నాడు. అతడి కన్నుల వెంట అతని ప్రమేయం లేకుండానే అవిరళంగా ఆనందాశ్రుధారలు కారిపోతున్నాయి. అంతకుముందు ఎన్నడూ అతడు రుచిచూచి ఉండని ఒక అలౌకికమైన దివ్యమైన ఆనందంతో శరీరం పులకించి అతనికి రోమాంచమైంది. దైవానుభూతి కలిగి అతని హృదయం పరవశించి నాట్యం చేస్తున్నది. గొంతు పూడుకొని పోయి స్వరం గద్గదం అయింది.

**వృ -** కాళ్ళు ఒడిలో అంతసేపు ఎందుకు పెట్టుకున్నావు? ఇది అంటురోగం. కాస్త చూసుకొని త్వరగా దేవుడు లేనిచోట కాళ్ళు పెట్టి పుణ్యం కట్టుకో నాయనా!

**నామ -** (గొంతుపూడుకుని మాటలు బయటకు రాకపోతుంటె, బలవంతంగా గొంతు పెగుల్చుకుని గద్గద స్వరంతో) గురుమహరాజ్! కల్పవృక్షము క్రింద ఉండికూడ ఆ కల్పవృక్షాన్ని గుర్తించని ఈ అజ్ఞానిని, దురహంకారిని మన్నించండి. మీరు నాకు బోధాస్వరూపమైన దివ్యానుభూతిని ప్రసాదించారు. ఇక ఈ సాధకుడికి, ముముక్షువుకు పూర్ణజ్ఞానం అనే అమృత స్నానం చేయించండి.

అంతలో ఒక పెనుగాలి వీచి గుడిలో అఖండ దీపం ఆరిపోయింది. అంతా గాఢాంధకారం. కాని నామదేవుడి అంతఃకరణలో మాత్రం పదహారు కళలతో నిండిన పూర్ణచంద్రుడి పున్నమి కాంతులు. ఎవరో **తత్వమసి, అహంబ్రహ్మాస్మి, అయమాత్మా బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ** అన్న మహావాక్యాలు అతనికి చెవిలో చెప్పినట్లు అవి అతని హృదయంలోకి దూసుకుని వెళ్ళినట్లు అనుభూతి కలిగింది. ఈ సకల చరాచరములన్నిటిలో వ్యాపించి ఉన్న ఆత్మవు నీవే నాన్నా! ఇక దేవుడు లేనిచోట నా పాదాలు పెట్టేయి,వృద్ధుడి కంఠం వినిపించింది.

**నామ -** ప్రభూ! మీ చరణాలే పరమేశ్వరుడు. మీ చరణం ఉన్నచోట పరమేశ్వరుడు లేకుండా ఉండటం ఎలా సంభవం? మీ చరణం సర్వ వ్యాపకం. అన్ని చోటులూ దానివే అయినప్పుడు, దానిని ఒక స్థానానికి పరిమితం చేయటానికి నేనెవడిని?

**వృ -** భళీ నామదేవా! ధన్యుడవు నీవు.

-సశేషం

# సంకీర్తన, ధ్యానం

(ఆస్ట్రేలియా, మెల్‌బోర్న్ నగరములో ప్రపంచ మత మహాసభలలో ది. 6-12-2009 ఉదయం శ్రీ మాతాజీవారి అనుగ్రహ భాషణం.)

My dear brothers and sisters!

your enthusiasm to paticipate in this observance this early morning shows your genuine interest in wanting to deepen your spirituality and thus work towards world peace. My mother tongue is Telugu. So I willbe speaking in Telugu which will be translated by Dr. Swarna mukhi.

ధ్యానానికి ఎంతసేపు కూర్చోవాలి? ఎలా కూర్చోవాలి. అనే విషయంలో మనం బాడీ(body)ని నిలబెట్టటానికి ప్రయత్నం చేస్తాం. మనం ప్రతీది కూడా ధ్యానపరంగా చేస్తాం. ధ్యానపరంగానే మన జీవితం వెళ్తోంది. ఏకాగ్రత అనేది లేకపోతే మన జీవితంలో ముందుకు వెళ్ళలేము. ప్రొద్దున లేచిన దగ్గరనుంచి జీవితంలో మన ప్రతి కదలిక కూడా మనం చేయాల్సిన పనిమీద ఏకాగ్రత చెంది ఉంటుంది. ఆ ఏకాగ్రత లేకపోతే మనం మొదలుపెట్టిన పనిని పూర్తి చేయలేం. కాకపోతే మనం చేసే ఈ ధ్వనులలో ఉన్నవాటి వల్ల మన మనస్సు ప్రశాంతతను పొందలేకపోతోంది. నిద్ర పోవటానికి కూడా, ముందు మన మనస్సు ఖాళీ చేసుకొని పనిలేదనుకుంటేనే పడుకోగలుగుతున్నాం. రెస్టు (rest) తీసుకోగలుగుతున్నాం. తిరిగిలేచేసరికి బాడీకి మాత్రమే రెస్టు అవుతోంది కాని నిన్నటి విషయాన్ని మనస్సు మళ్ళీ తీసుకువచ్చి ప్రశాంతత అనేది మన జీవితానికి లేకపోవటం చేత ఈ నాడు చాలా ప్రోబ్లెంస్ (problems)ని మనం ఫేస్ (face) చేయాల్సివస్తోంది.

మనస్సును గురించి, మన ఉపనిషత్తులూ, సనాతన ధర్మం నుంచి మా గురుదేవులు కూడా నేర్పించినది ఏమిటంటే, మనం ఉండాల్సిన స్థితిలో ఉండి, మనం తీసికోవాల్సినటువంటి విషయాన్ని సరియైన రీతిలో మనం పొందగలిగితే మనకి ప్రశాంతత మనతో పాటే ఉన్నది అనే విషయాన్ని మనం గుర్తించగలుగుతాం. మనం సంఘంలోనే ఉండాలి,మనం ప్రపంచంలో ఉండవచ్చు. మన మనస్సు ప్రపంచంలో ఉండవచ్చు. కాని మన మనస్సులో ప్రపంచం ఉండకూడదు.

అందుకని మన మనస్సును సరియైన త్రోవలో పెట్టాలంటే, ఎవరు ఏ మతంలో ఉన్నప్పటికూకూడా మన మత ప్రవక్త లేక మనం నమ్మిన ఇష్ట దైవం, లేదా మనం నమ్మినవారి పైన ఒక ఏకాగ్రత, ఒక నమ్మకం అనేదాన్ని మనం పెంపొందింపచేసికోవాలి. దానికి ఎవరో, ఎక్కడో, ఏ ఒక్కరో ఉంటారని కాదు. ఈనాటి సమాజంలో అనేకమంది ప్రవక్తలు మనని ఉద్ధరింపచేయటంకోసం మనకి తటస్థ పడటం జరుగుతోంది.

ఇటువంటి దాన్ని మనం permanent సత్యంగా అంగీకరించి మన మనస్సుకు శాంతి పొందటానికి అది మార్గం అని మనం దృఢ నిశ్చయం చేసుకోవాలి. దానికి మనం మనస్సును ఏకాగ్రం చేయాలనుకొన్నప్పుడు - చూడండి! చిన్న పిల్లవాడిని పడుకోబెట్టాలంటే, దానికి ముందర పిల్లవాడు చాలా ఏడుస్తూ ఉన్నప్పటికీ, తల్లి మెల్లగా జోలపాట పాడుతూ ఆ పిల్లవాడిని పడుకోబెడుతుంది. పడుకోబెడుతున్న సమయంలో పిల్లవాడు ఎంత ఏడుస్తున్నప్పటికీ కూడా మనకి ఎంత inconvenient (అసౌకర్యం)గా ఉన్నప్పటికీ, తల్లి పడుకోబెడుతూ పాడుతున్న పాటకి, వీపుమీద మెల్లగా కొడుతున్న ఆ దెబ్బలకి, ఆ చిన్న చిన్న లాలనలకి తాను కూడా ఆ పాటతో ఊఁ... ఊఁ... అని కలుపుతూ తల్లితో ఏకీభవించి మెల్లగా తానుకూడా నిద్ర పోతాడు. తల్లికూడా ప్రక్కన ప్రశాంతంగా పడుకుంటుంది. ఇది రోజూ జరిగే దిన చర్య. మామూలుగా మన లైఫ్(life)లో జరుగుతున్న ఈ విషయాన్ని తీసికొని మహాత్ములు మనకు **"ఓం"-** ప్రణవం అనేటువంటిదాన్ని, హిందూ మతంలో, ఒక మార్గాన్ని సూచించారు. అట్లాగే ఓంకారమనే ప్రశాంతతను పొందటానికి ముందు మనం ఎవరినైతే ఆశ్రయించి ఉన్నామో వారు చెప్పిన భగవన్నామాన్ని, సంకీర్తనను కొంచెం సేపు చేసుకుంటే మెల్లగా ప్రణవం అనే ఏకనాదంలోకి మనం వెళ్ళగలుగుతాము.

వాస్తవానికి మనం అట్లా ఎందుకు అనుసరించాలి? - పుట్టగానే చంటిపాపను తల్లే దగ్గరకు తీసుకోవాలి. తల్లి ఎలా చెబితే అలా నడుచుకొన్న పిల్లలే బాగా అభివృద్ధిలోకి వస్తున్నారు. అలా మన జీవితాన్ని మంచిమార్గంలోకి తీసుకొని రావటానికి తల్లి కారణమైతే, అదే తల్లి తండ్రులు మనకి ఒక గొప్ప మహాత్ముని చూపించటంకూడా జరుగుతుంది.

ఎవరూ వారి మతాన్ని మార్చుకోనవసరం లేదు. ఎవరి మతంలో ఉన్నటువంటి మూలాన్ని వారు అనుసరిస్తే చాలు. కాని మనం అనుసరించాల్సింది మాత్రం సత్యమార్గం(real true path). మతం మనని బంధించటంలేదు. మతంలో ఉన్న మతి మనని బంధిస్తోంది. ఇటువంటి inner peace (ప్రశాంతత)కు కారణం మనస్సే. మనస్సు ద్వారా వచ్చే సంకల్పాల ద్వారా మనం బంధనకు లోనవుతున్నాము. అందుకే ఉపనిషత్తు (అమృత బిందూపనిషత్తు) కూడా ఇలా ఘోషిస్తోంది -

**మనోహి ద్వివిధం ప్రోక్తం, శుద్ధం చా Z శుద్ధమేవచ ।**
**అశుద్ధం కామ సంకల్పం, శుద్ధం కామ వివర్జితమ్॥**

ఇలా మానవుడు రెండు మనస్సులతో ఉండటం చేత, ఒక మనస్సు మంచిని కోరుతుంది. ఒక మనస్సు, విషయాలతో కూడిన మనస్సు మనను బంధిస్తోంది. విషయరహితమైన మనస్సు సుఖాన్ని ప్రసాదిస్తోంది. ఇటువంటి మన మనస్సు మంచిమార్గంలో నడవటానికి ముందు సజ్జన సాంగత్యం -అంటే

మంచివారి సహవాసం అనేది ఏర్పడితే అసలు మనిషి ఎటువంటివాడో తెలిసిపోతుంది, సహవాసం వలన. దానికి శ్రీ గురుదేవులు ఒక ఉపమానము చెప్తుండేవారు. శనగగింజను(olive) మనం ఎందులో నానవేసి ఉంచితే అది దాంట్లో నానుతుంది. అది పంచదారరసమైతే అది తీయగా ఉంటుంది. వేపరసమైతే చేదుగా ఉంటుంది. అలాగే ఏదైనా ఊరగాయ(pickle) అయితే పుల్లగా ఉంటుంది. అలాగే మన మనస్సుకు సంఘంలో ఎందులో మనం ఫీడ్(feed) చేస్తే, అది దానికి అలవాటు పడుతుంది. దానికి మనం ఓం అనే ప్రణవాన్ని ఫీడ్ (feed)చేయటానికి కారణం ఏమిటంటే, మనం ముందర శబ్దాన్ని గ్రహిస్తాం. శబ్దాన్ని బట్టి మనం చూడటం నేర్చుకుంటాం. తరువాత మన చుట్టూ ఉన్న వాతావరణంలో దానికి ఏది నేర్పితే దాంట్లో మన మనస్సు play చేస్తుంది.

ఓం అనే ప్రణవం ఉచ్చారణకు కూడా మన హిందూమతంలో బోధ చేసి చెప్పింది ఏమిటంటే 'ఖాళీ'. ఖాళీ (space) అనేది ఉంటే దానిలోనుంచి వచ్చే sound (శబ్దం) మెల్లగా ఓంకారమల్లే వినిపిస్తుంది అని మనకు ఫీడ్ (feed) చేశారు. ఖాళీగా ఉన్న చిన్నమూతి ఉన్న చెంబును చెవి దగ్గర పెట్టుకుంటే ఓంకారం వినిపిస్తుంది. ఏ మనస్సు అలజడి లేకుండా ప్రశాంతంగా ఉంటుందో, అటువంటి మనస్సు నుంచి వచ్చేది ప్రశాంతమైన మాట. వారికి ప్రశాంతమైన జీవనము, ప్రశాంతమైన అనుభూతి కలుగుతుంది. అందుకని మనం అందరిలో మంచిని గ్రహించగలగాలి. మనలో ఉన్న మంచిని అందరికీ పంచిపెట్టగలగాలి. అప్పుడు మనకి ప్రశాంతత అనేది ఎక్కడా బయట దొరకటం లేదు. మనస్సులోనుంచే మనకు లభిస్తోంది. అది మనదై ఉన్నది. అది అంతటా ప్రకాశిస్తూ ఉన్నది. అటువంటి లోపల ఉన్న సహజమైన ప్రశాంతతకు అడ్డు తీసుకువచ్చేది ఏది? మనస్సు, అది ఊరవేసి ఉంచిన పరిసర ప్రాంతాలు, మనం అనుభవిస్తున్న జీవితం(life)లో ఉన్న అలజడి మనకు అడ్డుగా నిలబడుతోంది.

సహజంగా మనందరిలో ఉన్నది ఒక్కటే. అది ప్రశాంతమైనది. ఆ శాంతి శాశ్వతమైనది, సత్యమైనది. కాని మనం ఈ పుట్టటం, పోవటం అనే వాటి మధ్యలో మృత్యువు అంటే భయపడుతున్నాం. ఈ జన్మ వచ్చినందుకు ప్రపంచంలోని అలజడులతో ఉండబట్టే మనం ప్రశాంతతకు దూరమవుతున్నాము. మన సహజ స్థితిని మనం పొందలేకపోతున్నాము. అందుకనే మనం సర్వ భారంకూడా మనం ఏ మతంలో ఉన్నామో ఆ మత ప్రవక్త, ఒక భగవంతుడు లేక మనకన్నపెద్ద అయిన ఒక మహాత్ముణ్ణి ఆశ్రయించి వారిపై ఉంచి ఆయన మనకు ప్రసాదిస్తున్న" (WHY FEAR IAM HERE) అన్న అభయాన్ని ముందర మనం నమ్మాలి. దానినే, శ్రీ గురుదేవులు మనకు అభయంగా ఇచ్చినటువంటిది, ఒక పాట పాడి వినిపిస్తాను. మీరుకూడా ఎవరిని నమ్మి ఉన్నారో వారి వద్దనే ఉండి, మనస్సును వారిపైన ఉంచి

ఈ పాటను అందరం కలిసి పాడుకుందాం -

WHY FEAR IAM HERE
SAID THIS BABU SRI KALI BABU
FATHER AND MOTHER
TEACHER AND GOD

EVERY THING BABU SRI KALI BABU

ఈ పాడుకొన్న కీర్తన ఉన్నది కదా! ఎవరం ఎక్కడ ఉండాలో అక్కడ, మనం ఉండాల్సినచోటే మనం ఉన్నాం అని ముందర recognise చెయ్యాలి (గుర్తించాలి). మనది అన్నది, శాశ్వతమైనది అది ఒక్కటేగాని ఇవ్వన్నీ కూడా తాత్కాలికమైనవి అని గుర్తించాలి.

ఎప్పుడూ మన మనస్సు చేసే దోషాన్ని మనస్సుకే గుర్తింపచేస్తుంటే, దోష దృష్టి పోతుంది. దోషాన్ని ఎత్తి మనస్సుకు చూపించాలి. తరువాత మరచి పోవాలి. దాన్ని గురించి మళ్ళా మళ్ళా మనం ఆలోచిస్తే ఈ సమయం కూడా waste (వేస్ట్) అయిపోతుంది. అందుకని మనస్సుకు మనయొక్క సహజ స్థితిని గుర్తింపచేస్తూ భగవన్నామం గుర్తింపచేస్తూ ఆ భగవన్నామంలో మన మనస్సు అంతర్లీనం కావాలి. ఇలా మన హిందూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మన మహాత్మాగాంధీగారు ఇచ్చిన పాటను పాడుకుని ఒక్కసారి మనందరం కూడా(meditation) ధ్యానముద్రలోకి వెళ్ళటానికి ప్రయత్నిద్దాం -

**రఘుపతి రాఘవ రాజారాం - పతిత పావన సీతారాం**
**ఈశ్వర్ అల్లా తేరే నామ్ - సబ్‌కో సన్మతి దే భగవాన్**

ఎవరి faith ఏదైనప్పటికి ఈ పాటలో భగవంతుణ్ణే అందరికీ మంచి మనస్సు ఇవ్వమని ప్రార్థిస్తున్నాం. ఇప్పుడు ఒక చిన్ననామం చెప్పుకుందాం -

**రామ్ రామ్ రామ్ రామ్ రామ్ రామ్ రామ్**
**రామ్ రామ్ రామ్ రామ్ రామ్ రామ్ రామ్**

ఇంతవరకు మనం అందరం ఏ నామంలో ఉన్నామో, మనం ఎవరిని నమ్మామో ఆ దేవుని, ఆ భగవంతుణ్ణి తలచుకుంటూ మనం మెల్లగా, పిల్లవాడిని తల్లి ఎలా తాత్కాలికంగా నిద్ర పుచ్చుతుందో, అలా ఇప్పుడు మన మహాత్ములు మనకి నేర్పినటువంటి దానితో మనస్సును మెల్లగా అంతర్ముఖం చేసికొని, ఏకాగ్రతగా ధ్యానంలోకి వెళ్దాం. ఇలా ఎందుకు కూర్చోవలసి వచ్చిందంటే దేహం సహకరించినంతవరకు మనం ఎలా కూర్చోగలిగితే ఆ రీతిలోకూర్చోవాలి. నిటారుగా, వెన్నెముక మనకు దండంగా ఉంటుంది. మహాత్ములు దండం పెట్టుకుంటారు. మనం రెండో దండం అవసరం లేకుండానే మన గురుదేవులు చెప్పినట్లు మన వెన్నెముకనే నిటారుగా చేసి, ఆధ్యాత్మిక వీరుడిలాగా, మనస్సును అంతర్ముఖంచేసి ఓంకారంతో మనస్సును ధ్యానం లోనికి తీసుకువెళ్దాం! *

# ఆంతరంగిక శాంతి అన్వేషణలో
## అందరూ జ్ఞానాన్ని పంచుకోవటం

(ఆస్ట్రేలియా, మెల్‌బోర్న్ నగరములో ప్రపంప మత మహాసభలలో, భారతీయ మహాత్ముల ఆధ్యాత్మిక సదస్సులో ది. 8-12-2009న శ్రీ మాతాజీవారు ఆంగ్లంలో చేసిన అనుగ్రహ భాషణకు తెలుగు సేత.)

ఈనాటి సదస్సులో పాల్గొంటున్న పూజ్య పాదులు పరమహంస స్వరూపులైన మహాత్ములకు, మాననీయ సోదరసోదరీమణులకు నా వినయ పూర్వక వందనములు.

అస్మద్గురుదేవులు ఎన్నో ఆధ్యాత్మిక, ఆధ్యాత్మికేతర సాధనల ద్వారా నాకు అనుగ్రహించిన అధ్యాత్మ జ్ఞానాన్ని నేను మీ అందరితో పంచుకోవాలనుకుంటున్నాను. ఈ జ్ఞానం కేవలం ఆంతరంగిక శాంతిని పొందటానికే గాక, ప్రపంచంలో శాంతి స్థాపనకు కూడా సాయపడుతుంది.

హైందవ వేదాంతానికి ప్రాతిపదిక ఈ సర్వ సృష్టికి ఆధారమైన ఒక మహా శక్తి ఉన్నది అనే నిత్య సత్యం. దానిని ఒక మహాసముద్రంతో పోల్చవచ్చు. సముద్రం తనలో కలవటానికి వచ్చే నదులన్నిటినీ తనలో ఇముడ్చుకుని వాటికి తనలో స్థానం ఇచ్చినట్టు హిందూ సనాతన ధర్మం అన్ని మతాలకు తనలో స్థానం ఇస్తుంది. దేనినీ కాదనక అన్ని మతాలను అంగీకరిస్తుంది. సాధన ఫలించి ఒక వ్యక్తిలో ఆధ్యాత్మికంగా పరిణతి రావటం, సాధకుడు ఆ మహాశక్తిని తనలోని 'తాను'గా గుర్తించటంతో ప్రారంభమవుతుంది. తనలో ఆ శక్తిని దర్శించిన సాధకుడు, తనలోనేకాక తనకు బాహ్యంగా కూడా, సర్వేసర్వత్రా అంతటా ఆ మహాశక్తే నిండి వ్యాపించి ఉన్నది అన్న అనుభూతిని పొందుతాడు. ఆ విధంగా అతడు ఆ మహాశక్తి విశ్వవ్యాపకము, అద్వితీయము, అవ్యయము, అవిభాజ్యము, నిత్యము అయినది అన్న సత్యాన్ని గ్రహిస్తాడు. అతడు అనేకత్వంలో ఏకత్వాన్ని, భిన్నత్వంలో అభిన్నత్వాన్ని దర్శిస్తాడు. అతడికి తనకన్న అన్యమైనది ఏదీ లేక, అందరిలో తనను తనలో అందరిని దర్శించి ఆ అద్వైత జ్ఞానం వలన భయమంటే ఏమిటోకూడ ఎరుగని నిర్భయుడు(అంత కంటె అభయుడు అంటె బాగుంటుందేమో) అవుతాడు. అతడి హృదయం నిర్హేతుక జాయమాన కరుణతో, నిష్కళంకమైన ప్రేమతో నిండి తొణికిసలాడుతుంది. అటువంటి వాడు కేవలం ఒక్క మానవజాతి శాంతిసంక్షేమాలకే గాక, సకల చరాచర సృష్టి శాంతి సుఖాల కోసం కృషి చేస్తాడు. కాని ఇది సాధింప బడాలంటే ఆ మహాశక్తి యందు అచంచల విశ్వాసము, ఆ మహాశక్తి స్వరూపమే అయిన ఒక సమర్థ సద్గురు దేవులకు శరణాగతి చెందటం, ఆ సద్గురు దేవుల మార్గదర్శకత్వం ద్వారానే సాధ్యం. ఆ లక్ష్యాన్ని అందుకోవటానికి ఆ గురుదేవులు ధ్యానము, ప్రార్థన వంటి రకరకాల ఆధ్యాత్మిక సాధనలను, మతపరంగా పాటించవలసిన నియమాలను ఆచరింప చేస్తారు.

సముద్ర తీరంలో ఉండే అలలను దాటి లోపలికి వెళితే సముద్రం అక్కడ ప్రశాంతంగా, నిశ్చలంగా ఉంటుంది. అలాగే ఆంతరంగికమైన శాంతిని పొందాలంటే ఏ మతసంప్రదాయాన్ని అనుసరించేవారికి ఆ మతంలో అచంచల విశ్వాసంతో, వీడని పట్టుదలతో అందులోని లోతులలోకి పోయి వెతుక్కోవాలి. ఆ విధంగా మానవుడు ఆంతరంగిన శాంతికై చేసే అన్వేషణలో ఇతరులతో హృదయం దాచుకోకుండా, మర్మమూ కపటమూ లేకుండా చర్చించి ఇతరుల అభిప్రాయాలను సమదృష్టితో స్వీకరించగల నిష్పక్షపాత, నిష్కపట, ముందుగానే పక్షపాత వైఖరితో విచారించకుండానే నిర్ణయాలు చేయని బుద్ధిని అలవరచుకుంటాడు. ఈ భూమిని బాగుచేసి రోగాన్ని కుదిర్చి దాని సహజ స్థితికి తీసుకునిరావాలంటే అది ప్రతివారు తమతమ భావాలను, ఆలోచనా విధానాలను ఇతరులకు పంచిపెట్టటం, ఇతరుల అభిప్రాయాలను, ఆలోచనా సరళిని తాము స్వీకరించటం, ఆధ్యాత్మిక విలువలను పునరుద్ధరించటం ద్వారానే సాధ్యం. నేటి ప్రపంచంలో శాంతి అవసరం ఎంతైనా ఉన్నది. ప్రతి ఒక్కరూ తమ పురోభివృద్ధితోపాటు ఈ విశాల ప్రపంచం శ్రేయస్సుకు అనుగుణ్యంగా తన ప్రవర్తనను, ఆలోచనా విధానాన్ని మార్చుకోకపోతే శాంతి స్థాపన అసాధ్యం.

ఆధ్యాత్మికత పెంపొందేకొద్దీ మానవుడికి తనలో కలిగే పరిణతి అనుభూతికి వస్తుంది. అసూయ, ద్వేషము, స్వార్థము, అసహనము, పరమత ద్వేషము, మనస్సులో అశాంతి వంటి అవాంఛనీయమైనవన్నీ పోయి వాటి స్థానంలో నిర్హేతుకమైన దయ, ప్రతిఫలం కోరని నిష్కళంకమైన ప్రేమ, నిస్స్వార్థము, సహనము, శాంతి చోటుచేసుకుంటాయి. తనలోని 'తాను' ను గుర్తించిన జ్ఞాని అంతటా సర్వవ్యాపకము, సర్వశక్తిమంతము, సర్వజ్ఞము, సర్వసాక్షి అయిన ఆ మహాశక్తిని దర్శిస్తాడు. నానాత్వంలో ఏకత్వాన్ని దర్శించి, ఆ స్ఫూర్తితో లోకకళ్యాణానికి, విశ్వశాంతికి, ధర్మపరిరక్షణకు శాయశక్తులా కృషి చేయటానికి తన జీవితాన్ని అంకితం చేస్తాడు. ఆధ్యాత్మిక పరిణతి చెందినవారి వాక్కు మృదుమధురంగా, ఆత్మీయంగా ఉంటుంది. ఇది అందరిలో సంఘీభావం పెంపొందటానికి దోహదం చేస్తుంది. వారి మాటలు కాని, చేతలు కాని ఎవ్వరి మనస్సుకు కష్టం కలిగించేవిగా కాని, అపకారం చేసేవిగా కాని ఉండవు.

ధ్యానం ఎరుకని కలిగిస్తుంది. ప్రత్యేకించి ప్రస్తుత ప్రపంచంలోని సహజ వనరులను, పశుపక్ష్యాదులను, మానవజాతిని పరిరక్షించాలంటే ఈ ఆధ్యాత్మిక ఎరుక, జాగరూకత, శ్రద్ధా ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**ఉత్తిష్ఠత**(లే) **జాగ్రత**(మేలుకో) **ప్రాప్యవరాన్నిబోధత** (గమ్యం చేరేదాక ఎక్కడా ఆగకు). మన ప్రాచీన ఋషులు మనకు బోధించినది అది.

ప్రతీది ముందు తన దగ్గరనుండే ప్రారంభమవుతుంది. ఏది చేసినా, ప్రపంచానికి మేలు చేసినా, లేదా కీడు కలిగించినా మెలకువతో ఉన్నవాడు మాత్రమే చేయగలుగుతాడు కాని నిద్రపోతున్నవాడు చేయలేడు. ప్రజలు ధనాన్ని, ఇతర

వస్తువాహనాలను, విద్యను,వారి కాలాన్ని ప్రజాసంక్షేమం కోసం వినియోగించటం ద్వారా తమ సేవలను అందిస్తారు. అయితే ఇవన్నీ వారు మెలకువతో ఉన్నప్పుడు మాత్రమే చేయగలరు. కాని అవన్నీ వారు కీర్తి వ్యామోహంతో లేదా స్వప్రయోజనం కోసమో చేస్తారు. నిజమైన ఆత్మజ్ఞాని కూడా అటువంటి సేవ చేస్తాడు కాని అతడి సేవ స్వార్థరహితంగా, త్యాగభావం కలిగి ఉంటుంది. ఎందుకంటే ఆధ్యాత్మికతలో ఈ 'నేను' అంటే ఈ భౌతికమైన దేహం కాదు. భగవత్సృష్టిలో అంతటా నిగూఢంగా సర్వాంతర్యామిగా వ్యాపించి ఉన్న దివ్యత్వము. అతీంద్రియమైన ఈ తాను శ్రద్ధా తత్పరతలతో ఏసు క్రీస్తు, మహమ్మద్ ప్రవక్త, బుద్ధుడు, మహావీర జినుడు, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, అస్మద్గురుదేవులైన శ్రీబాబూజీ మహరాజ్ ఇక్కడి సభను అలంకరించిన మహనీయుల వంటి సద్గురు దేవులకు శుశ్రూష ద్వారా, వారు నడిపించిన బాటలో నడవటం ద్వారా, వారి అనుగ్రహం ద్వారా మాత్రమే అనుభవానికి వస్తుంది. గురుదేవుల యందు సంపూర్ణమైన, అచంచలమైన విశ్వాసం మాత్రం తప్పక ఉండాలి.

ఈ సకల చరాచర సృష్టి 'ఓం' అనే ప్రణవం నుండి ఉద్భవించినట్లు శాస్త్రాలలో చెప్పబడింది. విశ్వంలో సారభూతమైనదానికి, అలాగే ప్రతి మంత్రానికి ప్రాణము లేదా శిరస్సుకు శాబ్దిక చిహ్నమే ఈ ప్రణవము. మనము GOD అంటె భగవంతుడు అని పిలిచే విశ్వాత్మక శక్తి ఇదే. GOD లో G అనే అక్షరం జనరేటర్ అంటే సృష్టికర్తను, O అనే అక్షరం ఆర్గనైజర్ అంటే సంరక్షకుణ్ణి, స్థితిని కలిగిస్తున్నవాణ్ణి, D అనే అక్షరం డెస్ట్రాయర్ అంటే అంతం చేసే లయకారుణ్ణి సూచిస్తాయి. ఈ మహా శక్తి సర్వ వ్యాపకము, సర్వాంతర్యామి. ఆకాశంలో అవకాశం లేదా ఖాళీ ఉంటుంది. ఈ ఆకాశం లేదా ఖాళీకి శబ్ద తరంగాలను ఒక చోటనుంచి మరొక చోటుకి తీసుకొని పోయే స్వభావం ఉన్నది. గాఢ నిశ్శబ్దంలో జాగ్రత్తగా వింటే శబ్దగుణం గల అకాశంలో ఈ 'ఓం' అనే నాదం వినబడుతుంది. ఆత్మసాక్షాత్కారానుభూతిని పొందిన మహాత్ముల వాక్కు ఆస్తిక్యభావపూర్ణమై ఉంటుంది. ఆ వాక్కులనుండి ఆస్తిక్యభావ తరంగ ప్రకంపనలు ఉద్భవించి ఆకాశమంతా వ్యాపిస్తాయి. దీనికి విరుద్ధంగా ఎవరికి రాగద్వేషాల వంటి తమ మనోవికారలమీద, ఇంద్రియాలమీద సంయమనము కాని నిగ్రహము కాని లేదో అటువంటి వ్యక్తినుంచి అన్నీ నాస్తిక భావతరంగ ప్రకంపనలే ప్రసరిస్తాయి. అందువలన ప్రతి వ్యక్తి తన మనస్సును WATCH చేయటం అత్యంత ముఖ్యం. ఈ WATCH అనే పదాన్ని పరీక్షించి చూద్దాం.

W - watch your word అంటే నీ ప్రతి మాటను జాగ్రత్తగా గమనించు అని

A - watch your action అంటే నీ ప్రతి చర్యను గమనించు అని

T - watch your thought అంటే నీ ప్రతి ఆలోచనను గమనించు అని

C - watch your character అంటే నీ శీలాన్ని, స్వభావాన్ని గమనించు అని
H - watch your heart అంటే నీ హృదయ స్పందనలను గమనించు అని
భావించవచ్చు. ప్రతివారు ఏది మాట్లాడినా, ఏది చేసినా, దానిని తెలిసి ఆచరించాలి. ఎందుకంటే వారి ఆలోచనలు, చేతలు, ఆచరణ ఆస్తిక్య భావతరంగాలతో లేదా నాస్తిక భావతరంగాలతో ఈ సకల చరాచర సృష్టిని ప్రభావితం చేస్తాయి. ఈ తెలివిడి లేదా ఎరుకయే నిజమైన నిజ జాగ్రత్త. మన ప్రాచీన ఋషులు ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్నిబోధత (Arise, Awake, Stop not till the goal is reached) అని చెప్పిన దాని అంతరార్థం అనేకత్వంలో ఏకత్వం అనుభూతిని పొందటమే, సృష్టిలోని సకల చరాచర జీవజాలాన్నంతటిని నిస్వార్థంగా సేవించటమే లక్ష్యము, అని. అదే భగవంతుడికి నిజమైన సేవ.

ఆధ్యాత్మిక సాధన ప్రతివారి జీవిత విధానంలో ఒక భాగం కావాలి. భగవంతుని దివ్యానుభూతిని పొందే సాధనలో సజ్జన సాంగత్యం, తనవలనె ఆలోచించే వారితో సహవాసం ఎంతో సహాయ పడతాయి.

సంగదోషానికి 'నేను' 'నాది' అనే అహంకార మమకారాలే మూలకారణం. మానవుడు భౌతికమైన 'నేను'ను (అహంకారం) అందరూ గుర్తించాలని తాపత్రయ పడతాడు. తను దేనిని చూస్తే దానిని తనదిగా చేసుకోవాలి, ఇది నాది, అది నాది, వీడు నావాడు, వాడు నావాడు అనుకుంటాడు (మమకారం) ఆ విధంగా అతడు తన దృక్పథాన్ని అల్పమైనదిగా సంకుచితమైనదిగా చేసుకుంటున్నాడు. ఈ ప్రపంచం మనందరిది. అది ప్రత్యేకంగా ఏ ఒక్కడిదీ కాదు. ప్రపంచంలో గోచరించే నానాత్వము, భిన్నత్వము, ద్వంద్వాలకు కూడా ఆధారం ఆ మహాశక్తే అన్న దర్శనమే అసలైన సాక్షాత్కారానుభూతి. ఈ విశ్వమత సభ సదస్సుకు అదే పునాదిరాయి. శాంతి సుఖాలతో ధర్మముతో విలసిల్లే ప్రపంచమే తమ లక్ష్యంగాకల వివిధ మతాలకు చెందిన, ప్రజా వర్గాలమధ్య ఆధ్యాత్మిక సామరస్యాన్ని సాధించటంకోసం ఈ పరిషత్తు నిరంతరం కృషి చేస్తున్నది. అటువంటి ఈ పరిషత్తుకు సహాయసహకారాలు అందించ గలగటం ఒక మహద్భాగ్యం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి అవిరళంగా అవిశ్రాంతంగా అంకిత భావంతో తమ సేవలను అందించిన ఈ సమితి కార్యవర్గ సభ్యులను, అందులోని ఉద్యోగులను భగవంతుడు ఆశీర్వదించుగాక! ఈ కార్యక్రమంలో ఇంతవరకు పాల్గొని దీనిని విజయవంతం చేసిన మీఅందరికి నా ధన్యవాదములు. భగవంతుని ఆశీస్సులు మీపై సదా వర్షించుగాక! *

**జనవరి 17వ తేదీన శ్రీ మాతాజీ శ్రీ శుకబ్రహ్మాశ్రమం, శ్రీకాళహస్తిలో జరిగే కార్యక్రమాలలో పాల్గొంటారు.**

# గురుకృప

(గతసంచిక తరువాయి) -శివ ప్రసాద్

ఉదంకుడి దృఢ సంకల్పానికి అతని గురుభక్తికి ఇంద్రుడు సంతోషించాడు. అతడిని మాటలలో పెట్టి ఆ కొయ్యకోల వాడిమొనకు తన వజ్రాయుధం యొక్క పదునును శక్తిని ప్రసాదించి వెళ్ళిపోయాడు. ఆ పదునైన వజ్రాయుధం వంటి కోల తగలగానే భూమి భయపడి పాతాళలోకానికి దారి ఇచ్చింది. ఉదంకుడు క్షణంలో అనేక రత్న మణిమయ కాంతులతో దివ్యంగా ప్రకాశిస్తూ అనేక విధాలుగా దృఢమైన ప్రాకార పరిరక్షితమైన పాతాళలోకం చేరుకున్నాడు. దశయోజనముల పొడుగు, అయిదు యోజనముల వెడల్పు కలిగిన ద్వారము చూడగానే ఉదంకుడికి పాతాళలోకం ఎలా ప్రవేశించాలో తెలియలేదు. అతడు ఆ పాతాళ ముఖద్వారం వద్ద నిలబడి వినయంగా.....

**ఉదం-బహువన పాదపాబ్ధి కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ**
**సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాలి దాల్చి దు**
**స్సహతర మూర్తికిన్ జలధిశాయికి బాయక శయ్యయైన య**
**య్యహిపతి దుష్కృతాంతకుడనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్॥**
**అరిత తపోవిభూతి నమరారుల బాధలు నొందకుండగా**
**నురగులనెల్ల గాచిన మహోరగ నాయకుడా నమత్సురా**
**సుర మకుటాగ్ర రత్నరుచి శోభితపాదున కద్రి నందనే**
**శ్వరునకు భూషణంబైన వాసుకి మాకు ప్రసన్నుడయ్యెడిన్ ॥**
**దేవ మనుష్యలోకముల ద్రిమ్మరుచున్ విపుల ప్రతాప సం**
**భావిత శక్తి శౌర్యులు నపార విషోత్కట కోప విస్ఫుర**
**త్పావక తాపితాఖిల విపక్షులునైన మహానుభావులై**
**రావత కోటి ఘోర ఫణిరాజులు నాకు ప్రసన్నులయ్యెడున్ ॥**
**గోత్ర మహామహీధర నికుంజములన్ విపినంబులన్ గురు**
**క్షేత్రమునం బ్రకామగతి ఖేలన నొప్పి సహాశ్వ సేనుడై**
**ధాత్రి పరిభ్రమించు బలదర్ప పరాక్రమ దక్షుడే క్షణ**
**శ్రోత్ర విభుండు తక్షకుడు శూరుడు మాకు ప్రసన్నుడయ్యెడున్ ॥**

అనంతాది నాగకుల ప్రభృతులందరినీ ఎంతో భక్తితో స్తోత్రం చేశాడు. కాని ఎవ్వరూ అతని వద్దకు రాలేదు. కుండలాలు ఇయ్యలేదు.

**ఉదం -** ఇప్పుడు నేను ఏమి చేయాలి? నేను నా గురుదేవులకు చెప్పకుండా, వారి ఆశీస్సులు పొందకుండా వచ్చినందు వలన ఇలా జరిగిఉంటుందా?

ఊహూ. అసంభవము గురుదేవుల చక్షువు విశ్వ చక్షువు. అయన దృష్టి చొరరాని చోటు లేదుకదా. భగవంతుడినైతే రమ్మని రక్షించమని ప్రార్థించాలేమోగాని గురుదేవుల విషయంలో అలా కాదు కదా! తన విశ్వచక్షువుతో నిరంతరము తనను ఆశ్రయించిన వారందరిపై తమ కృపాదృష్టి బరపుతూ వారిని కంటికి రెప్పలా కాపాడుతుంటారు కదా. ఇంకా కంటికి రెప్పపడటంలోనైనా ఆలస్యం ఉంటుందేమోకాని గురురక్షణలో ఆ ఆలస్యం కూడా ఉండదని అందరికీ అనుభవంలో ఉన్న సత్యమే కదా! గురుదేవుల కృప నిరంతరం వర్షిస్తూనే ఉంటుంది. ఆలస్యానికి కారణం దానిని స్వీకరించటంలో నాలోని లోపమే.

గురుదేవా నాకు ఆ శక్తిని ప్రసాదించు అంటూ ప్రార్థిస్తూ చుట్టూ చూశాడు. అక్కడ అతడు తెలుపు నలుపు వస్త్రాలు ధరించియున్న ఇద్దరు స్త్రీలను, ద్వాదశార చక్రమును త్రిపుతున్న వారిని ఇద్దరను, వారి కుమారులను మహోన్నతమైన గుఱ్ఱాన్ని ఎక్కిన మహాతేజస్వి అయిన ఒక దివ్య పురుషుణ్ణి చూసి అతణ్ణి మహార్థవంతములైన మంత్రములతో ఎంతో భక్తియుక్తుడై స్తుతించాడు. అప్పుడా దివ్యపురుషుడు....

**ది.పు -** ఓ ఋషివర్యా! నీవు చేసిన ఈ యథార్థ స్తోత్రానికి నేను అత్యంత ప్రీత మనస్కుడను అయినాను. అయినదానికి, కానిదానికి ఇలా విచారపడటం నీవంటి వానికి భావ్యం కాదు. నీ గురుసేవా తత్పరత నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్నది. ఓ అనింద్య చరిత్రా! నాకు నీకేదైనా వరం ఇవ్వాలనిపిస్తున్నది. నీ కోరిక ఏమిటో చెప్పు. తప్పక తీరుస్తాను.

**ఉదం -** (సంతోషంతో) మహాత్మా! ఈ నాగకులం అంతా నాకు వశమయ్యేటట్లుగా అనుగ్రహించండి.

**ది.పు -** సరే. నీ అభీష్టము సిద్ధించాలంటే ఈ దివ్య అశ్వము ఆసనం వద్ద గట్టిగా ఊదు.

**ఉదం -** (సందేహిస్తూ) మహాత్మా! మీరెవరో నేను ఎరుగను. ఈ అశ్వమెవరో నేను ఎరుగను. అయినా అశ్వం ఆసనం దగ్గర మూతి పెట్టి ఊదటం ఏమిటి?

**ది.పు -** ఓ మునిసత్తమా! సందేహించకు. నేను చెప్పినట్లు చేయి. నీకు కార్యసిద్ధి కలుగుతుంది. నేను దేవేంద్రుణ్ణి. నీ గురుసేవా తత్పరతకు సంతోషించి నీ గురుసేవలో సాయపడి నేను కూడ గురుకృపకు పాత్రుడిని కావాలనే వచ్చాను.

ఇంద్రుడు అలా అంటుండగానే అతని వాహనంగా అరుణవదనము, నల్లని శ్వదము, తెల్లని తోకతో ప్రకాశిస్తున్న ఆ తురగము....

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

9శ్లో॥ పల్లవారుణ పాణి పఙ్కజ సఙ్గి వేణురవాకులం
ఫుల్లపాటల పాటలీ పరివాది పాద సరోరుహమ్,
ఉల్లసన్మధురాధర ద్యుతిమఞ్జరీసరసాననం
వల్లవీ కుచకుమ్భ కుఙ్కుమ పఙ్కిలం ప్రభుమాశ్రయే

సాయం సంధ్యా సమయంలో ఆ ఆశ్రమమంతటా నిశ్శబ్దం అలముకొని ఉంది. శిష్యసమూహమంతా తమ తమ అనుష్ఠానాలలో మునిగి ఉన్నా, వారి హృదయాలలో తెలియని భీతి ఏదో ఆవరించి ఉంది. వారికి దాపునే ఉన్న, ఒక రావి చెట్టు తిన్నెమీద, వ్యాఘ్రాసనంపైన, పద్మాసనస్థులై సమర్థ సద్గురు నాథులు, మూసిన కనులతో ధ్యాననిమగ్నులై ఉన్నారు. కాని వారి అంతరంగమంతా చింతాక్రాంతమై ఉంది. ఏవేవో ఛలోక్తులాడుతూ, అందరినీ నవ్విస్తూ, ఆధ్యాత్మిక విషయాలను వివరించి చెప్తూ తమ అమృతమయమైన బోధలతో శిష్యులందరికీ దారి చూపుతున్న గురుమూర్తి అలాగ మౌనం వహించి ఉండటం శిష్యగణమందరికీ బాధాకరంగా ఉంది. అలాగ ఉండటానికి కారణం కూడా వారందరికీ తెలుసు. పెనుతుఫాను రాకకుముందు ప్రశాంత వాతావరణం నెలకొని ఉన్నట్లు వారికి తోస్తున్నది.

అంతలో సద్గురుదేవులు కళ్ళు తెరిచి 'సుదర్శనా!'' అని పిలిచారు. శిష్యులంతా ఆ పిలుపు విని ఉలిక్కి పడ్డారు. దూరదూరాన నిలిచి చెవులు రిక్కించారు. వారు పిలిచిన సుదర్శనుడు అనే శిష్యపరమాణువు ముందుకి వచ్చి గురుమూర్తి ఎదుట చేతులు కట్టుకుని నిలబడ్డాడు. తల వాల్చి మొహం చూపలేకుండా ఉన్నవానితో 'నీ సాధన పరిపక్వతనందే సమయాన ఇలాగ పతనమైపోయావేమిరా?'' అన్నారు గొంతులో కఠినత్వమూ మనస్సులో ఆర్ద్రత నిండిన గురునాథులు. "ఏం జరిగింది చెప్పు?'' అన్నారు మళ్ళీ. ఆ గతానాగతావేది అయినా స్వామి వాని నేరం వాని నోటివెంటే చెప్పించాలని, గురుమూర్తి వద్ద మనస్సు దాయరాదు అనే పరమ సత్యాన్ని ఎరుకపరుస్తూ. "గురుదేవా! దుర్మార్గులైనవారు నా మనస్సులో విషబీజాలు నాటారు. మాయా వశుడనైన నేను వాటి ప్రభావాన మనస్సు చలించి సత్య దృష్టి నశించి వారితో చేయి కలిపి సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపులుగా ఎంచుకుని కొలుచుకుంటూ వస్తున్న మీ గురించి తేలికమాటలు మాట్లాడాను. మహాపరాధం చేశాను.

ఇందుకు మీరే శిక్ష విధించినా అనుభవించటానికి నేను సిద్ధంగా ఉన్నాను'' కంఠం రుద్ధమై ఆపైన ఇక మాట్లాడలేక పోయాడు సుదర్శనుడు. "అచలా! నువ్వు వచ్చి వారి మాటల సారాంశమేమో చెప్పు'' అన్నారు గురుదేవులు. అచలుడు వచ్చి చెంత నిలిచి నమస్కరించి "గురునాధా! ఈ మధ్య కొత్తగా వచ్చి ఆశ్రమంలో చేరిన ప్రభంజనుడు, గోముఖుడు తరుచుగా సుదర్శనునితో సంభాషణలు, మైత్రి సాగించారు. ఉన్నమాట విన్నవించుకుంటున్నందుకు తమరు అనుగ్రహించి క్షమించాలి. గడిచిన కొద్దికాలంగా సుదర్శనుని తమరు మాటిమాటికీ అదిలిస్తూ కోపంగా విదిలిస్తూ వస్తుండటం గమనించిన వారిద్దరూ సుదర్శనుని చేరబిలిచి "ఏమి గురువయ్యా! ఇంత కోపదారి అయి సామాన్యుని వలెనే ప్రవర్తిస్తున్నవారు. అటువంటివారు సామాన్యులే గాని జితేంద్రియులైన తపోధనులెలాగ అవుతారు? సాధనా పరిపూర్ణుడవైన నువ్వు తన కంటె అధికుడవై మోక్షార్హుడవౌతావేమోనని భయంతో నిన్ను వదిలించు కోవడానికేమో యిలాగ నీ మనస్సుని విరిచేస్తున్నారు'' అనే సరికి పదే పదే ఆ మాటలు వారంటుంటే సుదర్శనుని మనస్సు వారి వశమైంది. గురుమూర్తిని నిందించేవారి నాలుక తెగకోయాలి లేదా వారి దగ్గిర నిలవరాదని తమరు సెలవిచ్చిన విధంగా సుదర్శనుని, వారిని విడిచి మరో చోటికి మరలి పోయాము.'' అచలుని మాటలు విన్న గురుదేవులు శిష్యులమంటూ వచ్చి చేరిన ఆ మూర్ఖులను పండిన పంటకు వినాశకారులై దాపురించీ చీడపురుగుల వలె సుదర్శనుని మతి చెరిచిన వారిని ఏ విధంగా శిక్షించాలో మీరే నిర్ణయించి అమలు జరపండి. సుదర్శనా! పశువును కట్టేరాట గట్టిదనాన్ని ఊపి ఊపి చూసినట్టు సాధకుల మనోబలాన్ని విశ్వాసాన్ని పరీక్ష చేసి చూస్తుంటారు సత్య గురుదేవులు. ఆ పరీక్షలో నువ్వు నెగ్గలేకపోయావు. గురుదూషణ మహా పాపం. అది దేహాంతరాన గాని నశించదు. కనుక నువ్వు... నువ్వు... మాటా పలుకూలేని అడివిలోని మానువై పో!'' అంటున్న గురుమూర్తి శాప వాక్యాలు వింటూ కంటికి కడివెడుగా కన్నీళ్ళు కారుస్తూ స్వామి పాదాలపై వాలి పోయాడు. "మహా దోషివైన నీవు నన్ను తాకరాదని కఠినంగా శాసించాలన్నా నాకు మనస్సు రావటం లేదు. కారణం ఇంత కాలంగా నువ్వు చేస్తూ వచ్చిన సాధన నన్నెంతో అలరిస్తూ వచ్చింది గనుక. అయితే స్వయం కృతాపరాధం వలన కలిగిన దుష్కర్మ ఫలాన్ని అనుభవించక తప్పదు. నువ్వు చేసిన సుకృత కర్మ గొప్ప యోగమార్గంలో పయనించటం, అది వృథాకారాదు. -సశేషం

## మౌనధ్యాన సప్తాహశిబిరం

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

కావున త్రికాలాతీతమైనది. కరచరణములు, గోత్రసూత్రములు, బ్రాహ్మణాది జాతులు బ్రహ్మమునకు లేవు. అది పురుషుడు, స్త్రీ, నపుంసకుడు కానిది. అనగా లింగ వర్జితము, కేవలము సచ్చిదానందమయము. ఆ పరతత్త్వమునకు ఆకారములు, వికారములు, జననమరణములు, పుణ్యపాపములు లేవు. కావున అది అద్వితీయము, సహజము, సమము, ఏకామృతరసము, అట్టి పరబ్రహ్మ స్వరూపమగు సద్గురు మూర్తికి నేను నమస్కరించుచున్నాను'' అని గురుగీత చెప్తోంది. వివేక చూడామణి కూడ జాతినీతి కూలగోత్ర దూరమైనది, నామరూప గుణ వర్జితమైనది, దేశకాలాతీతమైనది ఆధ్యాత్మ తత్త్వం అయి ఉన్నది అని చెప్తోంది. అట్టి బ్రహ్మరూపం మీద మనస్సును పెడితే అది తదాకారం చెందుతుంది.

వారు మనని ఉంచుతున్నారు లేకపోతే తదుపరి కార్యక్రమం - అంత్యక్రియే. ఒక శ్రీకృష్ణుడు, ఒక శ్రీరామచంద్రుడు మనలో ఉన్నప్పుడు నేను ఉన్నాను అని తెలుస్తోంది.

సీతమ్మ అయోనిజ. నాగలి చాలులో దొరికింది. రాముడు అసలు పుట్టనేలేదు. పుట్టినట్లు కనిపించాడు. ఆయన పుట్టినరోజు పెళ్ళి రోజు ఒకటే. అదే జీవబ్రహ్మైక్య సంధానం. అదే లీల. అమ్మ ప్రకృతిగా వచ్చింది. రాముడు పుట్టినట్లు కనిపించాడు. వారిద్దరికి పెళ్ళట.

**బాజత్ పైజనియా.........**

ఆ పాదాల మీద చిరుగజ్జెలు మృదువుగా మ్రోగుతుంటే, రాముడు ఠుమక్, ఠుమక్ అని అడుగులేస్తుంటే, ఆ భావన ఎంత అందంగా ఉంటుంది?

ఖిల ఖిలాత్ ఉఠత్ డాయో, గిరత భూమి లట్పటాయె. బాల రాముడు కిల కిల పరిగెడుతుంటే పట్టేసుకుందాం అనిపిస్తుంది. ధ్యానంలో కూడా అలా అందనట్లే ఉంటాడు. వెంకన్న బాబును చూడాలంటే తిరుపతి వెళ్ళాలి. హృదయ బాబును చాడాలంటే బృందావనానికి రావాలి. కాని ఎంత సేపు అక్కడ మనం ఉంటాం?

ఆ బాల రాముడు అప్పటికీ ఇప్పటికీ పరిగెడుతూనే ఉన్నాడు. పట్టుకుంటే పట్టుబడేవాడే. ముగ్గురు రాణులు పట్టుకోవాలని పరిగెడితే ఢబాల్న

పడేవాడు. ఆయన పడుతూ లేస్తూనే ఉన్నాడు. గురుదేవులు నడుస్తూ ఉంటే ఆయన వెనక పరిగెట్టినా అందేవారు కాదు. ఆయనది నడక, మనది పరుగు. ఆయన దయ కలిగితేగాని అందుకోలేం.

రాముడు క్రింద పడితే ఆయనని ఆలింగనం చేసుకొనేది భూమి. ఆమె రాముణ్ణి పట్టుకొని ఉన్న ఆ సన్నివేశం తల్చుకుంటే మన మనస్సు రోమాంచితం అవదా? ఉన్నది ఒక్కడే. పట్టుకోనేది ముగ్గురు. మనలో రాముడు ఠుమక్, ఠుమక్ అని అడుగులు వేస్తున్నాడు. ప్రకృతి నీకు సంబంధించినదే. కాని నువ్వు అందులో ఉండి పోతున్నావు. నన్ను చూడు. ప్రకృతిని వదిలి పెట్టు అంటున్నాడు రాముడు.

**విద్రుమసే అరుణ అధర బోలత మృదు వచన మధుర్**
**సుందర నాసికా చీచ్‌లటకత నత కనియా**

దొండపండు కంటే ఎర్రగా ఉండే పెదిమలతో చిన్ని చిన్ని మాటలు మాట్లాడుతుంటే.

కిట్టయ్యా! మాకు కొంచెం పెట్టవా? అని గోపబాలురు అడిగితే ఆయన తెచ్చుకున్నదంతా అందరికీ పెట్టి తను మాత్రం తినేవాడు కాదట. నా కడుపు నిండింది అనేవాడు. అప్పణ్ణించీ ఇంతే. మన కడుపు నిండితే వారి (గురుదేవులు) కడుపు నిండేది. బాలరాముడికి కాడ నత్తు ఉండేది. అది అలా అలా కదిలి సృష్టిని కదిలిస్తుందట. తులసీదాసు అలా దర్శించి మనకు ఈ కీర్తనను ఇచ్చాడు.

జయదేవుడు కూడా అలా దర్శిస్తూ మనకు అష్టపదులను ఇచ్చాడు. తులసీదాసు అలా ఆనందిస్తూ రాముని ముఖారవిందాన్ని దేనితో పోల్చాలా అని ఆలోచిస్తూ చివరికి రఘువరుని ముఖానికి సమానమైనది రఘువరుని ముఖారవిందమే. ఆయన ముఖానికి ఉన్న కాంతి అంతా కలిసి రాముడు అయ్యాడు. ఆయనకు ఆయనే సాటి. మన కళ్ళు అన్నీ చూస్తాయి. మన కళ్ళను మనం చూడలేము. నువ్వు ఉన్నది ప్రభువును గుర్తించటానికి. ప్రపంచాన్ని గుర్తించటానికి కాదు. ఎప్పుడు ప్రపంచాన్ని దాటుతావో అప్పుడే పరమాత్మ సామ్రాజ్యానికి వారసుడవు అవుతావు. సూత్రాలు ఎప్పుడూ ఉండేవే. అమ్మవారిని సూత్రాలతో సహా చెక్కుతారు. ఏది ఉన్నా లేకపోయినా, ఎప్పటికైనా జీవితానికి ఒకడే పతి. జగత్తుకి ఈ సూత్రాన్ని ఆయన ఎప్పుడో కట్టేశాడు.

అసలు ఆయన ఎంత దయామయుడు అంటే......... రావణుడు

రాముని ద్వేషించేవాడు. చిన్నతనంలోనే విభీషణుని రాముని చంపమని పంపాడు. అప్పుడే కౌసల్య రాముని ఉయ్యాలలో పడుకో బెట్టింది. నిద్రపోయాడు కూడా. ఎప్పుడైతే విభీషణుడు బాణం పట్టుకొని వచ్చాడో, రాముడు లేచి ఏడవటం మొదలు పెట్టాడు. తల్లి వచ్చింది, ఏడుపు ఆపాలని తంటాలు పడుతోంది. బయటకు చూపించాడు. పైకి వెళ్ళమన్నాడు, అక్కడ సౌధంపైన విభీషణుడిని చూపించాడు. రాముడు పైన తిరగటం, విభీషణుడు క్రింద తిరగటం. అప్పుడు రాముడికి కౌసల్య నోట్లో ముద్ద పెట్టింది. క్రింద విభీషణుడు బాణం ఎక్కుపెట్టి ఉన్నాడు. రాముడు తుపుక్కున ఉమ్మేశాడు. అప్పుడే విభీషణుడిలో భక్తి బీజం నాటేశాడు. అందుకే విభీషణుడు రాముని భక్తుడు అయ్యాడు.

ధ్యానం ఎలా చేసికోవాలి? అని గురుదేవులను ఒక భక్తుడు అడిగాడు. దానికి గురుదేవులు నువ్వు ఆలోచించినది దేనికి సంబంధించినది? నువ్వు ఆనందిస్తూనే ఉన్నావు. ధ్యానం నీకంటే భిన్నం కాదు. అదే స్మృతిని మనం సమయం సద్వినియోగం చేసికోవటానికి, గురుదేవులు మనకి సందేశాలను అందిస్తున్నారు.

రావణుడు విభీషణుని నీ దిక్కు ఉన్న చోటికి పో! అనగానే తాను వెళ్ళాలని అనుకోలేదు. రాజ్యం వస్తుందని అనుకోలేదు. వచ్చి ప్రభువును ఆశ్రయించాడు. కావాల్సిన ఆశ్రయం వెంటనే దొరికింది. ఎంతమంది ఆలోచించారు? వచ్చినవాడు శత్రుపక్షంవాడు. శరణు ఇచ్చేముందు ఆలోచించాల్సిన విషయం అన్నారు. రాముడు హనుమంతుని వైపు చూశాడు. "రామచంద్రా! శరణు కోరిన వారిని ఆదుకోవటం ధర్మం అని మీరే చెప్పారుకదా!" అన్నాడు.

అలా శరణు పొందుతూనే ఊహించని రీతిలో విభీషణునికి పట్టాభిషేకం చేశాడు. విభీషణుని లంకకు రాజుగ చేశాడు. పక్కవాళ్ళు అడిగారు, "రామచంద్రా! ఇంకా రావణుడు చావలేదు. ఒకవేళ రావణుడు శరణు కోరితే?" అన్నారు. వెంటనే రాముడు "రావణుడు అయోధ్యకు రాజు అవుతాడు" అన్నాడు.

ముందుకు సాగిపోవాలి. వెనక ఉన్న జీవితాన్ని గుర్తించి, ఊర్ధ్వగాములై గురునాధుని కృపకు పాత్రులవ్వాలని, గమ్యస్థానం చేరాలని శ్రీ గురుదేవులను ప్రార్థిస్తున్నాను. సుఖీభవ! సుఖీభవ! *

# మాతాజీ బోధామృతం

- శివ ప్రసాద్

(2009 శరన్నవరాత్రములలో ది 28-9-09 నాడు శ్రీమాతాజీ ప్రబోధమునకు సంక్షిప్త రూపం)

మన పూర్వ జన్మలలో చేసుకున్న పుణ్యానికి సత్ఫలితంగా మన గురుదేవులు, మన జీవితాలను నిజమైన, సహజమైన పూర్ణ జీవితాలుగా చెయ్యాలని మనకు ప్రసాదించినవి ఈ పుణ్యదినాలు. ఒక దీక్షగా పెట్టుకున్నాము కనుక ఈ నవరాత్రి దీక్షలలో ఇది అయిదవ రోజు అనుకుంటున్నాము. అప్పుడే కొందరు మనస్సులో లెక్కలు వేస్తున్నారు 12 రోజులలో అప్పుడే అయిదు రోజులు అయిపోయాయి, ఇక వారం రోజులే ఉన్నది అని. ప్రతివాడు వారంలో ఉండే ఆ ఏడు వారాలలో ఏదో ఒక రోజునే మరణిస్తాడు. ఏదో వారం నాడు మనం వెళ్ళిపోవచ్చు. మరి మనం ఎంత జాగ్రత్తగా ఉండాలి? నిరంతరం నిజజాగ్రత్తలో ఉండి సత్య వస్తువు విషయమై విచారణ చేస్తూ ఉండాలి. మనసే మాయ. ఎన్నిసార్లు మాయ అనుకున్నా, భ్రాంతి అనుకున్నా అదేమైనా కనిపిస్తుందా? అందుకే దానిని ప్రక్కన పెట్టి ఉన్న సత్య వస్తువును గురిస్తే ఫలితం మనదై ఉంటున్నది.

అమ్మ ఎలా ఉంటుంది? పంచమీ,పంచభూతేశీ, పంచసంఖ్యోపచారిణీ పంచ ప్రేతమంచాధిశాయినీ, పంచబ్రహ్మస్వరూపిణీ, పంచప్రేతాసనాసీనా, పంచ తన్మాత్ర సాయకా, పంచకృత్య పరాయణా, శ్రీ సద్గురు పాదుకాస్తవంలో

**పంచ పంచ హృషీక దేహ మనశ్చతుష్క పరస్పరం**
**పంచవర్ణ మఖండ మచ్యుత మాదికారణ మద్భుతమ్** అని
**పంచ భూత సకామషట్క సమీర శబ్దముఖేతరమ్**
**పంచకోశ గుణత్రయాది సమస్త ధర్మ విలక్షణం,** అని
**పంచముద్ర సులక్ష్యదర్శన భావమాత్ర నిరూపణం,**అని
**పంచవర్ణ శుచిర్విచిత్ర విశుద్ధ తత్త్వ విచారణం,**అని ఉన్నది.

అటువంటి సద్గురుదేవుల పాదుకలను ప్రాతరేవహి మానసాంతర్భావయేత్ అని ఉన్నది. అంటే దానర్థం ప్రొద్దున్నే తలచుకోవాలి అని. అమ్మయ్య ఇవ్వాల్టకి ప్రొద్దున ప్రార్థన అయిపోయింది అనుకుంటే ప్రయోజనం ఏముంది? ప్రొద్దెక్కి 12గం.లకు నిద్రలేచేవాడికి ప్రార్థన కాలం ఎప్పుడు? వాళ్ళు 'మాతాజీ! రాత్రి మేము పడుకొనే సరికి ఒంటిగంట అవుతుంది' అంటారు. అదే దిగ

జారిపోవటానికి మార్గం. ప్రొద్దున్నే పిల్లలను స్కూలుకు పంపవలసి ఉంటే ఎవరు లేపితే లేస్తున్నారు? భార్య లేపితే లేస్తారు. భార్యతో కూడ నేను ఇంకో రెండుమూడు గంటలు పడుకుంటాననంటే కుదురుతుందా? పిక్కపాయసం పెడితే లేస్తాడు. అది దేహానికి కాదు, మనస్సుకు పెట్టాలి. మనస్సుకు ఊపిరాడనంత పెట్టాలి.

శ్వాసను ప్రాణాయామంతో నియంత్రించాలి. ప్రాణవాయువు లోపలికి పోతూ ఉంటేనే బ్రతికి ఉన్నట్లు. ముక్కు దగ్గర వేలు పెట్టి ఉన్నాడా, పోయాడా అనేది గుర్తిస్తారు. శ్వాసతో జరిగే సోzహం అనే అజపగాయత్రిని ఎంత గుర్తిస్తున్నాము? గుర్తిస్తే భగవంతుడు నేను గుడికే కట్టుపడి ఉంటానన్నాడా? అలా అంటే సర్వవ్యాపకత్వానికి లోటురాదా! మానవుడే ఇది నా గుడి, అది నీ గుడి అంటాడు. అంటే సర్వ సమానత్వానికి అడ్డం పెడుతున్నారు. దేవుడు దివ్యమైనవాడు. నిత్య ప్రకాశం కలిగినవాడు. ప్రకాశస్వరూపుడైన ఆ దేవుడు ఎలా ఉంటాడు?

ఒకమహారాజుగారికి మూడు సందేహాలు కలిగాయి. భగవంతుడు ఏం చేస్తున్నాడు? ఎటువైపు చూస్తుంటాడు? ఎక్కడ ఉంటాడు?అని. ఆయన దగ్గర ఒక పండితుడు ఉన్నాడు. మహారాజుగారు తన సందేహాలను తీర్చమని పండితుణ్ణి అడిగాడు. ఊరికే అడగటంకాదు, వీటికి సమాధానం చెప్తే సరే. లేకపోతే నీకు శిరచ్ఛేదం అవుతుంది జాగ్రత్త అని హెచ్చరించాడు. పాపం ఆ పండితుడికి సమాధానం దొరకలా. ఆలోచిస్తున్నాడు. అనుభవం ఉంటే వెంటనే చెప్పగలం. లేకపోతే కనీసం వినికిడి జ్ఞానమైనా ఉంటే చెప్పవచ్చు.

మానవుడు ఎందుకు పుడుతున్నాడు? పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనంతో మానవ జన్మ సార్థకం అవుతుందా? మరి ఎందుకు వచ్చినట్లు? రావటం, ఉండటం, వినటం, చేయటం, ఆచరించటం, తినటం, అనుభవించటం అన్నీ చేస్తున్నాము కదా! దీనిని ఆధ్యాత్మిక పరంగా తీసుకుందాము. ఉండటం అంటే ఏమిటి? ఉండటం అంటూ జరిగితేనే తర్వాత కార్యక్రమాలు. ఉన్నారు కనుకనే పుట్టెకొక బుద్ధి. ఉండటం అంటూ లేకపోతే ఐస్‌బాక్స్(ice box) లో పెట్టి, భగవద్గీత పారాయణ మొదలు పెడ్తారు. ఉన్న తరువాత వినటం. శ్రవణేంద్రియం ద్వారా బాగా శ్రవణం చేస్తున్నాము. కనిపించింది కాబట్టే వినటం. అది అంతర్గతం. తరువాత చేయటం. దేనిని వింటున్నామో దానిని చేయటానికి ప్రయత్నం చేస్తున్నాము.

భగవన్నామం చేస్తున్నాము. గురుసోదరులు ఆ మంత్రం చెప్తే మాతాజీ ఇంకొక మంత్రం ఇచ్చారు. దానిని ప్రార్థనలో కూడ చేర్చాము. వినటం, చేయటం అయింది. ఇక తినటం. ఏదైతే చేస్తున్నామో, దానిని మనస్సుద్వారా తింటున్నాము. తినటం అంటే అనుభవిస్తున్నాము. వెంటనే అనుభవం వస్తున్నది.

అబ్బ! ఇవ్వాళ పారాయణలన్నీ అయిపోయాయి. అన్నీ చక్కగా మెల్లగా చదువుకున్నాము. ఎంత తృప్తిగా ఉంటుంది. శ్రీమాతా, శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ....... అంతలో మనస్సు ఎటో పోతుంది, అదే తిప్పలు. ఉన్న స్థితిని వదిలేసి, అనవసరంగా తిప్పలు పడుతున్నాము. ఆ మనస్సు ఎక్కడికి వెళ్ళాలన్నా, దానికి టికెట్(ticket) అవసరం లేదు. పాస్‌పోర్టు(pass port)అవసరం లేదు. వీసా(visa) అంతకంటే అవసరం లేదు.

ఆ జగన్మాత ఏమి చేస్తున్నది? పంచకృత్య పరాయణాయై నమః, పంచ తన్మాత్ర సాయకాయై నమః, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులు బయట కనిపించే వాటిలో దొరికేవి, మన జ్ఞానేంద్రియముల ద్వారా మనస్సు వాటిని గ్రహిస్తుంది. ఒరే! తెల్లవారు జామునే కాదురా, నీకు మరపు నుంచి ఎప్పుడు గుర్తు వస్తే అదే సత్యః ప్రాతః కాలము, అదే నిజ జాగ్రత్త. కొందరు బయట ఊళ్ళకు వెళ్ళేవాళ్ళు ఉంటారు. అమ్మయ్య ప్రొద్దుననే లేవక్కర్లేదు అనుకుంటారు. వేరే ఊళ్ళవాళ్ళు ఉంటారు. అక్కడ ఎలాగూ చేస్తారు కదా! ఇక్కడైనా పడుకోండి అంటారు. దానికీ లొంగకపోతే TV ఉండనే ఉంది కదా! దానిని ఆన్(on) చేసి ఇంతేకదా అనుకుంటారు. ఎంత టైం గడిచిందో తెలియదు. ఇంటి వాళ్ళకు ప్రొద్దుపోయేదాక TV చూడటం అలవాటు. ~~ఈ~~ భక్తుడు కూడ వాళ్ళతో మమేకం అవుతాడు. ఇక ప్రొద్దున్నే ఏం లేస్తాడు? గురుదేవులు 'ప్రొద్దున్నే ప్రార్థన టైమ్‌లో ప్రార్థన చేసి కావాలంటే ఆ తరువాత పడుకోమనేవారు.

అప్పుడప్పుడు మా కుమారస్వామి అంటాడు "అమ్మా! 11గం 30ని దాటింది 12 గంలకు ఇంకెంతో లేదు. లఘు ప్రార్థన చేసి పడుకోవచ్చు" అని.

భక్త సమాజ్ అనిపించుకొనేవాళ్ళు భగవత్తత్త్వాన్ని పంచుకోవాలి. అవతలి వాళ్ళతో మాట్లాడేటప్పుడు భగవంతుడి మాటలే మాట్లాడాలి. మాట్లాడేవి చేయాలి. ప్రొద్దున్నే ప్రార్థన చేసి తీరాలి.

-సశేషం

# మాతాజీ సత్సంగ్ డైరీ

-రమణ ప్రసాద్

(గతసంచిక తరువాయి)

ఈశావాస్యమిదగ్ం సర్వం అంటుంది, ఈశావాస్యోపనిషత్. ఈ ప్రపంచంలో ప్రతి అణువులో ఈశ్వరుడు వ్యాపించి ఉన్నాడు. ఆ భావనచేస్తూ కళ్ళు మూసుకుంటే ఎంత తాదాత్మ్యత చెందుతున్నాము. అప్పుడు తితీక్ష వస్తున్నది. వాటిని మనం తీసికోకపోతే అవి వృథా అవుతాయి. తితీక్ష అంటే ఎదుటివాడు ముఖంమీద ఉమ్మివేసినా తుడుచుకొని పోవటం. ఏకనాధస్వామి ఏమైనా బాధ పడ్డాడా? రామదాసు ఏమైనా బాధపడ్డాడా? రామదాసును కొట్లోవేశారు. చెరసాలలో వేసిన తరువాత, ఆయన తాను అంతరంగంలో పదిలపరచుకున్న మూర్తిని అక్కడ ఒక గోడమీద రాతితో చెక్కాడు. దేహానికి పవిత్రతను కలిగించాలి. తితీక్ష వస్తున్నప్పుడు ఎన్నింటినో ఎదుర్కోవలసి ఉంటుంది. వాటన్నింటినీ తుడిచేసుకోవాలి. గర్భం ధరించిన స్త్రీ తొమ్మిది నెలలు ఎన్నో బాధలు పడుతుంది. నొప్పులు వచ్చినప్పుడు ఇంకా బాధ పడుతుంది. కాని ప్రసవమై బిడ్డను చూసుకోగానే బాధలన్నీ మరచిపోతుంది. మన సాధన కూడ అంతే.

కొందరు తెల్లవారుజామున లేవలేక పోతున్నామండీ? అలారం మ్రోగుతుంది కాని నేను లేవటంలేదు అంటారు. కాని అలవాటైనవారికి అలారం అవసరంలేదు. స్నానం ఎందుకంటే బద్ధకంపోవటానికి. లేకపోతే నిద్రవస్తుంది. అవి లేకపోయినాసరే, ఆ టైమ్‌లో ప్రార్థన తప్పక చేసికోవాలి.

ఒక చిన్న దెబ్బ తగిలితేకూడ చచ్చాామురా అంటాము. తగిలింది ఏ బొటనవేలికో లేదా చిన్నవేలుకో. కాని చచ్చాామురా అంటాము. చావు అన్నింటి కంటె బాధాకరమైనది అని మన ఊహ. అందుకే ఏమాత్రం బాధ కలిగినా చచ్చాామురా అంటాము. వాటిని లేకుండా చేసేది తితీక్ష. కొందరు కఠినంగా మాట్లాడుతారు. అది వారి స్వభావం. అప్పుడు కూడ మనం భగవంతుణ్ణి ప్రార్థించాలి. మనసా, వాచా, కర్మణా అన్నారు. ముందు మనస్సుచేసినది కర్మ. తర్వాత వాక్కులతో చేసింది కర్మ. ఆ తరువాత కర్మేంద్రియాలతో చేసింది కర్మ. తితీక్ష వస్తే శ్రద్ధ అక్కడే తొణికిసలాడుతూ ఉంటుంది. సక్కు అమ్మను ఆమె అత్తగారు ఎన్నిమాటలు అనలేదు? ఎన్నిబాధలు పెట్టలేదు. కాని అవన్నీ ఎవరికి చేరినై? పాండురంగడికి. మనం ఆశ్రయించిన స్వరూపం భగవంతుడే అయి ఉన్నది.

ఆ తరువాత సమాధానం. అంటే అనుభూతి. పిండాకూడు అని తింటే అది పిండాకూడే అవుతుంది. అందరితో కలసి ప్రసాదం అని తీసికొంటే అది ప్రసాదమే అవుతుంది. అప్పుడు జీవన్ముక్తస్థితి వస్తుంది. జీవించి ఉండగానే

మరణించాలి. అదే జీవన్ముక్తస్థితి. అదే నిజమైన సన్యాసం అంటే. ఇవన్నీ ఆచరిస్తే ముక్తి అదే వస్తుంది.

**ధ్యానమూలం గురోర్మూర్తిః పూజామూలం గురోఃపదం**
**మంత్రమూలం గురోర్వాక్యమ్ ముక్తిమూలం గురోఃకృపా॥**

గురుదేవుల కృప ముక్తికి మూలం. గురుపదం పూజకు మూలం. పదం అంటే ఇంకొక అర్థంకూడ ఉన్నది. గురుముఖతః వచ్చే పదాలను మనం ఆచరించాలి. గురుదేవులు ఏది చెప్తే అదే మనకు మంత్రం. గురుదేవుల ఒక్క కడగంటి చూపుచాలు. లేదా ఆ అభయహస్తముద్రచాలు. లేదా వారి యోగముద్ర. అవన్నీ ముద్రలు. TVలో కార్యక్రమాలను చూసే బదులు ఆ ముద్రలను తలచుకుంటే, వాటిని మనో నేత్రంతో దర్శిస్తే ఆనందం కల్గదా? హృదయం ద్రవించి ఆనందబాష్పాలురావా? దేవుడు దుఃఖానికీ, ఆనందానికీ రెండింటికి మనకు కన్నీళ్ళే వచ్చేలాపెట్టాడు.

ఈ చెమట కూడ ఎందుకు పెట్టాడో తెలుసా? వేరే యోగాకేంద్రానికి వెళ్ళక్కర్లా. అక్కడ డబ్బులు తీసికొని స్టీమ్‌బాక్స్(Steam Box)లో పెడతారు. ఇప్పుడు ఇంట్లో ఐస్‌బాక్స్(Ice Box)లో పెడుతున్నారు

చచ్చిపోయిన తర్వాత ముక్తిరాదు. బ్రతికి ఉండగానే వస్తుంది. ఎవరు గురుదేవులు చెప్పింది చెప్పినట్లుగా ఆచరిస్తారో వాళ్ళు వెనుకకు తిరిగి చూసుకోనక్కర్లా. ఉన్నదానితో తృప్తిపడటం, గురుదేవులు చెప్పింది చెప్పినట్లు ఆచరించటం చేస్తేముక్తి అక్కడే ఉంది. శ్లేష్మంలో పడ్డ ఈగలాగా సంసారంలో పడ్డవారు దానిలో చిక్కుకొనిపోతారు. పనికిరాని వాటిని గురించి మాట్లాడుతూ, సమయాన్ని వృథా చేసుకుంటూ, మనం సంసారంలో కూరుకొనిపోతున్నాము.

ఈ ప్రపంచంలో అన్నీ మారిపోతున్నాయి. మనదేహంలో కూడ బాల్యంపోయి కౌమారం వస్తున్నది. కౌమారంపోయి యౌవనం వస్తున్నది. యౌవనంపోయి వృద్ధాప్యం వస్తున్నది. మరణం కూడ వీటిలో ఒకటి. దాన్ని గుర్తించినవారు అమృతత్వాన్నిపొందుతారు. తతోమృతత్వమశ్నుతే.

నారాయణుడే సృష్టికిమూలం. నారాయణుడే అన్నీ అయి ప్రకాశిస్తున్నాడు. నారాయణుడే అన్నిటినీ లయం చేసుకుంటున్నాడు. ఈమేనును 'నేను'అనే అధికారంలేదు. అలా ఎవరైనా అనుకుంటే వాడు దుఃఖిస్తున్నాడు. ఆ భగవంతుని కృపవలన ఇంతసేపు విచారణ చేసుకొనే అవకాశం కలిగింది. ఎప్పుడూ ఇలా కూర్చోము. మనస్సు అన్నింట్లో ఉంటూ పథ్యం చేయ్యాలి. భక్తియోగం చదివితే భక్తుల లక్షణాలు తెలుస్తై. ఆ మహాత్ముడు మనకు తన పాదాల చెంత ఇంత ఆశ్రయం ఇచ్చాడు. దానిని గుర్తెరిగి మన జీవితాన్ని సార్థకం చేసికొందుముగాక! *

# శ్రీ బాబూజీ దివ్యవాణి

ఇది దుర్మతినామసంవత్సరం. దుర్మతి అనే పేరువిని భయపడనవసరం లేదు. ఎందుకంటే, మనకు సర్వరక్షకుడైన పరమాత్ముడున్నాడు. ఆయన అవ్యాజ కరుణామూర్తి, ఆప్తబాంధవుడు,అనాధ రక్షకుడు. ఆయన దివ్య చరణార విందాలకు భవలతలను త్రుంచగలశక్తి ఉంది. జన్మ జన్మాంతరాల నుండి ఆర్జించిన కర్మబంధాన్ని హరించి దివ్యత్వం ప్రసాదించ గల దివ్య తేజోరాశి ఆయన. సర్వసమర్థుడైన ఆ ప్రభువును మనం గాఢంగా విశ్వసించి హృదయంలో నిలుపుకుంటే, పంచాగంలో వ్రాసిన రాశి ఫలితాలను, గ్రహచారాన్ని చూసి భయపడనక్కరలేదు. భవభయాన్నే హరించగల భగవానునికి ఈ గ్రహభయాన్ని హరించటం ఒక లెక్కా?

అయితే కొంత శ్రమ మాత్రం పడక తప్పదు. ఎలాగైనా శ్రమపడి ఆయనను మనస్సులో నిలుపుకోవాలి. ఆ మధురనామ రుచిని సదా గ్రోలుతూ ఉంటే కామక్రోధాదులు, నీచ గుణాలు ప్రవేశించలేవు. మాయ మోసగించి వశపరచుకోలేదు. తప్పుడు మార్గం పట్టించి అధోగతికి తీసుకుపోలేదు. ఎట్టి ఈతిబాధలూ కలుగకుండా కాపాడుతూ, సదా ఆనందంలో ఓలలాడిస్తూంది ఆ పవిత్ర నామస్మరణ. జనరేటరు వేగంగా తిరిగితే కరెంటు ఉత్పత్తి అయినట్లు, నామస్మరణ జపమాలకు అందనంత వేగంగా జరిగితే మనలో శక్తి ఉత్పన్నమవుతుంది. ఎవరైనా కరెంటు తీగను తాకితే అంత దూరాన వెళ్ళి పడతారు. అలాగే ఆ దివ్య శక్తి దుష్టశక్తులను దరిజేరనీయక తరిమి వేస్తూ కవచంగా కాపాడుతుంది. దివ్య శక్తి వలన ఉదయించిన జ్ఞాన తేజస్సుతో నిన్ను నీవు తెలుసుకోగలవు. అంటే ఆత్మదర్శనం లభిస్తుందన్నమాట.

గురుదేవుడు ప్రసాదించిన లక్ష్యార్థాన్ని మనస్సులో నిలుపుకుంటే సంసారదావాగ్ని మధ్య ఉన్నా మానవులకు ఏ భయమూ, బాధ ఉండదు. గురుకృప అతనికి వజ్ర కవచం. పూర్ణిమనాటి చంద్రబింబం లాగా అతని జీవితం పూర్ణ కాంతితో ప్రకాశిస్తుంది. ఆ కాంతిలో కామక్రోధాదులు, ఈషణ త్రయమూ మొదలైనవన్నీ హరించిపోతాయి. సత్యస్వరూపం ధరిస్తుంది మనస్సు. అంతులేని ప్రశాంతి పొందుతుంది చిత్తము. పరమదయా స్వరూపంగా అతని బుద్ధి మారిపోతుంది. అపార ప్రేమలో అహంకారానికి చోటే ఉండదు.

సద్గురు కృపాకిరణం సూర్యకాంతి కంటే గొప్పది. సూర్యకాంతి కొన్నిటినే ప్రకాశింపజేస్తుంది. భూమిపై ఒక వైపున సూర్యకాంతి పడితే రెండోవైపున పడదు.

ఆ కాంతికి పగలూ, రాత్రి ఉన్నాయి. గ్రహణాలున్నాయి. కాని సద్గురు కృపాకాంతి అలా దేనిచేత పరిమితం కాబోదు. అది నిత్య సంపూర్ణ కాంతి. ఆ కృపా కిరణంలో జీవించే మానవుని అజ్ఞానమనే చీకటి ఎన్నడూ ఆవరించదు.

పంచాంగం కాలగమనాన్ని తెలిపేది. ఆది కాలంలోనిది. కాలానికి అతీతుడు, కాలాన్ని ప్రకాశింప చేసేవాడు భగవంతుడు. ఆయన పాదద్వయం హృదయపీఠంపై ధరించిన మానవునిలో ద్వైతం హరించి దివ్యదృష్టి కలుగుతుంది. ఇక పంచాంగ ఫలితాలు అతనిని భయపెట్టలేవు. అష్ట గ్రహ కూటాలు వచ్చినా అతన్నేమీ చేయలేవు. గురుకృప వల్ల అవన్నీ శుభ గ్రహాలుగా మారి అతనికి సుఖశాంతులు అందజేయ గలుగుతాయి.

వసంత ఋతువులో ఎండుటాకులన్నీ రాలిపోయి నవనవలాడే క్రొత్త చిగుళ్ళతో చెట్లు అందంగా ఉంటాయి. అలాగే మానవునిలోని ప్రారబ్ధ కర్మలన్నీ ఆకుల్లా రాలిపోయి మృదువైన మధురభావాలు చిగురించాలి. మధువులొలికే, చక్కని పుష్పాలతో ఈ నవవసంత లక్ష్మి అలంకరించుకుని, అందాలు చిందుతూ పరిమళాలు వెదజల్లుతున్నట్లు, భక్తి కుసుమాలు మానవునిలో వికసించి ఈ మధుర భావాలనే సువాసనలను వెదజల్లాలి.

ఇటీవల నంబూరు ఆశ్రమంలో చేసిన ప్రసంగంలో సమర్థ సద్గురు శ్రీకాళీ వర ప్రసాదబాబుగారు పరమాత్మను, గురుదేవులను నమ్ముకొన్న వారిని గ్రహాలేమీ చేయజాలవనే విషయాన్ని చక్కగా వివరించి అభయమిచ్చారు. *

## ఆహ్వానము

శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమము హైదరాబాద్ శాఖవారు 22-01-10 శుక్రవారం నుండి 26-01-10 మంగళవారం వరకు శ్రీకాళీగార్డెన్స్ పీఠాధిపతులు పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారి **సత్సంగ సమావేశములు** ఆశ్రమ శాఖా భవనంలో ఏర్పాటు చేశారు. ది. 22నుండి ది. 26వరకు కార్యక్రమాలు ఆశ్రమ శాఖా భవనంలో జరుగుతాయి. నిత్య కార్యక్రమాలే కాక ఈ విశేషకార్యక్రమములు - ది. 23 శనివారం రాత్రి 8గం॥లకు ఆశ్రమ బాలబాలికలచే నాటక ప్రదర్శన. ది. 24 ఆదివారం ఉ.10గం॥లకు సామూహిక సద్గురు పాద పూజలు, ది. 26 మంగళవారం (భీష్మ ఏకాదశి) ఉ. 10గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ కూడ ఆశ్రమ శాఖా భవనంలో జరుగుతాయి. వివరములకు శ్రీ వి.వి.ఎస్. మూర్తి ఫోన్ నెం: 23835153, 9866074229 శ్రీ జి. జగదీశ్వర్ ఫోన్ నెం 27766284, 9985666797. హైదరాబాద్ శాఖ ఇంటి నెం 10-4-503/ ఎ, శ్రీరామ్‌నగర్ కాలనీ, హైదరాబాద్ - 500028. ఫోన్ నెం 23329062

# సమర్ధ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీబాబుకు కలకత్తా నగరంతో ఎంతో ఆత్మీయమైన అనుబంధం ఉన్నదనిపిస్తుంది. తమ సాధన కాలంలో శ్రీబాబు అతి తరచుగా కలకత్తా వెళ్ళే వారు. కలకత్తాలో ఉన్నపుడు, ప్రతిరోజు ఉదయమే కలకత్తా నుండి కాలి నడకను దక్షిణేశ్వరం వెళ్ళి భగవాన్ శ్రీరామ కృష్ణ పరమహంస ఆరాధించిన భవతారిణీ కాళీమాత దర్శనం చేసుకుని అక్కడ పగలంతా ధ్యానం చేసుకునే వారు. తిరిగి రాత్రికి కలకత్తా వచ్చేవారు. కలకత్తాలో ఉన్న ఒక పెద్ద హోటల్ యజమాని శ్రీబాబు భక్తుడు. ఆయన సమర్పించిన నివేదనను (భిక్షను) శ్రీబాబు స్వీకరించి, రాత్రికి అక్కడే విశ్రాంతి తీసుకునే వారు.



సాధనకాలంలోనే కాక ఆ తరువాత కూడా, తమ అవతార పరిసమాప్తి వరకు, శ్రీబాబు ప్రతి సంవత్సరము శ్రీదేవీ శరన్నవరాత్రి పూజలు పూర్తి అయిన వెంటనే నియమం తప్పకుండా కలకత్తా వెళ్ళి, కొన్ని రోజులుండి వచ్చేవారు. అంతేగాక అవకాశం దొరికినప్పుడల్లా కలకత్తా వెళ్ళి జగన్మాత దర్శనం చేసుకోవాలని ఎంతో ఉత్సాహ పడేవారు. “కలకత్తాలో నా కళ్ళకు గంతలు కట్టి తీసుకుని వెళ్ళి, నన్ను ఎక్కడ వదిలిపెట్టి గంతలు విప్పినా, అక్కడ నుండి నేను నగరంలో ఎక్కడికి రమ్మంటే అక్కడికి రాగలను. ఆ నగరంతో నాకు అంత సన్నిహిత సంబంధం ఉన్నది'' అనేవారు శ్రీబాబు.

గంతలు కడితే, మనకు కళ్ళు కనబడవు. కనుక మన అల్ప అనుభవానికి అందేటట్లుగా “నా కళ్ళకు గంతలు కట్టి.....'' అని శ్రీబాబు అన్నారు. అంటే, మనం వారిని మానవ మాత్రులుగా భావించి పొరపాటు పడతామేమో పరీక్షించటానికి అన్న మాయ మాట మాత్రమే అది. మనకు గంతలు కట్టక పోయినా, కళ్ళు తెరిచే ఉన్నా, ఎదురుగానే సర్వత్రా నిండి ఉన్న సత్య వస్తువును చూడలేని అజ్ఞానపు గంతలు ఎప్పుడూ మన కళ్ళకు కట్టే ఉంటాయి. కాని మహాత్ముల దృష్టి జ్ఞాన దృష్టి. దానికి గంతలతో కాని, చర్మ చక్షువులతో

కాని, సంబంధమే లేదు. తమలోనూ, వెలుపలా, విశ్వమంతా అణువణువునా నిండి ఉన్న సత్య వస్తువు, ఆ జ్ఞాన చక్షువులకు సదా స్పష్టంగా గోచరిస్తూనే ఉంటుంది. ఆ జ్ఞాన దృష్టిని ఏ గంతలూ అడ్డుకొనలేవు. కనుకనే శ్రీబాబుకు ఒక కలకత్తాయే కాదు; ప్రపంచంలో ఎక్కడి విషయమైనా, ఎప్పటిదైనా, స్పష్టంగా దృగ్గోచరం కావటంలో ఆశ్చర్యం లేదు.

కలకత్తా నగరంతో శ్రీబాబుకు గల అనుబంధం, శ్రీరామకృష్ణ పరమహంసను గుర్తుకు తెస్తుంది. శ్రీబాబు, శ్రీరామకృష్ణ పరమహంస, యిరువురూ శ్రీకాళీమాత నిత్యదర్శనానందాన్ని అనుభవించిన వారే. ఆ కారణాన్ని బట్టి వారిద్దరూ శక్త్యుపాసకులు మాత్రమే అనుకునే ఆస్కారం లేకుండా, యిరువురూ ఎక్కడా రాజీ పడని, యిరవై నాలుగు క్యారట్ల బంగారం వంటి శుద్ధాద్వైత అనుభవ సిద్ధిని పొంది, దానినే ప్రచారం చేసిన వారే. ఇరువురూ శ్లోకాలను గాని, క్లిష్ట పదాలను గాని ఉపయోగించకుండానే, తేలిక మాటలలో, లోతైన తత్త్వమును, పరమ పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో బోధించిన వారే. ఇరువురూ సదా తురీయాతీత స్థితిలో నిలిచిన రాజయోగి పుంగవులే. ఇరువురూ అతి నిరాడంబరులే. ఇరువురూ గడుసువారికి గడుసువారే. ఇరువురూ మాయనే మాయలో ముంచగల అమాయకులే. ఇరువురూ అమూల్యమూ, అపారమూ అయిన తమ ఆధ్యాత్మిక సంపదను విశ్వ మానవాళికి అందించటానికి తగిన శిష్యుని ఎన్నుకొని, వారి ద్వారా ఆ సంపదను విశ్వమంతటా వెదజల్లుతున్నవారే. అయితే, వారే వీరేమో? ఏమో ఏమిటి? వారే వీరు; వీరే వారు. నిజానికి వారు, వీరు మాత్రమే కాదు; ప్రపంచంలో యిదివరకు అవతారం ధరించి వచ్చిన, యిప్పుడు వస్తున్న, యిక ముందు రాబోయే మహాత్ములందరూ, ఏకైక నిత్య సత్యమైన పరతత్త్వానికి, దేశ, కాల, క్రియాదులననుసరించి, నామ, రూప, గుణ, భేదాలతో అభివ్యక్తమయ్యే భిన్న, భిన్న ప్రతీకలే.

సాధనకాలంలో సాధకుడు తన సాధనను ఎంతో రహస్యంగా ఉంచుకోవాలని శ్రీబాబు అనేవారు. తనకు మార్గదర్శకత్వం చేసే గురువుతో మాత్రమే సాధకుడు తన సాధనను గూర్చి సంప్రదించాలి. సాధనలో తాను పొందే స్థితులను గ్రహించి గురువు తనకు చేయూతనిస్తాడు. ఇతరులు విమర్శిస్తారు, లేదా అసూయపడతారు తప్ప సాధన అభివృద్ధికి తోడ్పడరు. "నా బాల్యంలోను, సాధన కాలంలోను, ప్రజల దృష్టిలో పడకుండా చాలా

జాగ్రత్త పడేవాడిని. ఎన్నో కష్టాలను ఎదుర్కొని సాధన చేసి ఆర్జించిన ఈ జ్ఞానధనాన్ని మీరు కూడా అందుకొని, ఆత్మానంద సామ్రాజ్యాధిపత్యానికి వారసులు కావాలని, మీకు అరచేతిలో ఉసిరికాయ ఉంచినట్లు అందిస్తున్నాను. ఆ జ్ఞాన రత్నాలను అందుకొని ఏ ఒక్కరు తరించినా, నా అవతార కార్యం నెరవేరినట్లు భావిస్తాను. అంతేగాని అందరి చేత "ఓహో! ఆహా! " అని అనిపించుకోవాలనే కీర్తి వ్యామోహం నాకు లేదు. "ఆహా! ఓహో!" అన్న ఆ నోటితోనే అపనిందలు వేసే విశ్వాస హీనులైన ఇన్ని కోట్ల ప్రజానీకం దృష్టిలో పడటం కన్న, ఆ జగన్నాథుని దృష్టిలో, ఆ పరమేశ్వరుని దృష్టిలో పడితే చాలని భావిస్తాను" అని శ్రీబాబు అనేవారు.

"నేను బాల్యంలో పొలం దున్నేవాణ్ణి. వ్యవసాయం చేసే వాణ్ణి. మిగతా పనివాళ్ళతో పనిచేసి, తీరిక సమయాలలో ఏ చెట్టు క్రిందనో కూర్చుని ధ్యానం చేసుకొనే వాణ్ణి. కాయ కష్టం చేసి జీవించే వాళ్ళ సమస్యలేమిటో ఆవిధంగా తెలుసుకునే ప్రయత్నం చేశాను. చిరిగిన వస్త్రాలతో ఉండే వాణ్ణి. పాదాలకు తాటి మట్టలు కట్టుకుని తిరిగాను. ఏ ఆహారం లభిస్తే దానితోనే తృప్తిపడే వాణ్ణి. ఏమీ లేకుండా ఎన్నాళ్ళు గడిపానో లెక్కలేదు. సాధన కాలంలో నేను పడిన కష్టాలను వింటే మీరు దుఃఖాన్ని భరించలేరు" అని శ్రీబాబు అప్పుడపుడు ప్రసంగవశంగా తెలుపుతూ ఉండేవారు.

శ్రీబాబు వ్యవసాయ కార్యక్రమము బాల్యంలోనేగాక, తమ అవతారకాలమంతా కూడా కొనసాగింది. సాధనకాలంలో వారు కఠోరసాధనల రూపంలో తమ హృదయ క్షేత్రములో వ్యవసాయం జరిపి జగన్మాత అనురాగపు పంటలు పండించుకున్నారు. ఇక తమ అవతార పరిసమాప్తి వరకు వారు మానవుల హృదయ క్షేత్రాలలో నిరంతర వ్యవసాయం జరుపుతూనే ఉన్నారు. ఆ క్షేత్రాలన్నీ క్షేత్రజ్ఞుడైన సద్గురు మూర్తికి అత్యంత సుపరిచితములు, స్వంతములు అయినవి. ఊసర క్షేత్రాలైన తమ హృదయ క్షేత్రాలను పంట భూములుగా మార్చుకోవటానికి మానవులు పడవలసిన కష్టాలన్నిటిని తామే భరించి, అటువంటి క్షేత్రాలన్నిటిని చదును చేసి, కలుపు తీసి, పదును చేసి, భక్తి బీజములు నాటి, ప్రేమగంగా ప్రవాహంతో మొలకెత్తించి, విజ్ఞాన కుసుమాలను విరబూయించి, సుజ్ఞానపు పంటలు పండించి, మోక్షమనే ఫలసాయాన్ని అందించటమే తమ అవతార ప్రణాళికగా నిర్ణయించుకుని అవతరించిన అవ్యాజ అనుగ్రహమూర్తి, భక్త హృదయ సామ్రాజ్య చక్రవర్తి శ్రీబాబు.

-సశేషం

# త్రికాలవేది శ్రీబాబు

- కాగుపాడు బుల్లిమామ్మ

సంవత్సరాలు గుర్తులేవుగాని శ్రీబాబు కాగుపాడు వచ్చేవారు. చెరువు దగ్గిర పెద్ద మండువా లోగిలి ఉండేది. ఆ యింటికి ఎత్తైన అరుగులు ఉండేవి. ఆ అరుగుమీద కూర్చునేవారు. రోడ్డు ప్రక్క ఇల్లు, ఎవరో ఒకరు కూర్చునేవారు. మండువాలో పెద్ద బల్ల ఉండేది. దానిమీద పడుకునేవారు. బాబుగారిని కోమటి సాధువుగారని పిలిచేవారు. భోజనం కోమట్ల యింటి వద్ద ఏర్పాటు చేసేవారు. పాలు అవీ ఇంటివారే ఇచ్చేవారు. మా అక్కగారింటికి వచ్చేవారట. ఎవరికైనా ఏదో ఒకటి చెప్పేవారట. మా పిన్నికి ఈ విషయం తెలిసి మా బాబాయిగారిని సాధువుగారిని ఇంటికి తీసుకురమ్మని గొడవ పెట్టారట. మా బాబాయి ఆ దారిన వెళ్ళేవారట. శ్రీ బాబుని చూసి తన భార్య తీసుకురమ్మనమందని ఒకరోజు బాబుని తీసుకు వెళ్ళినారు. మా బాబాయికి తల్లి ఉంది తండ్రి లేరు. ఆమెకు పొలం ఉంది. నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఒక అమ్మాయికి భర్త పోయాడు. ఆమె వద్ద ఉంటుంది. బాబూజీని ఆ పొలం ఎవరికి చెందుతుందని అడిగితే, ఆమె మనమరాలిని మీ అబ్బాయికి పెండ్లి చేసుకుంటే మీకు దక్కుతుంది. లేకపోతే దక్కదు అని చెప్పారట. అప్పుడు శ్రీబాబు చెప్పినట్లే చేసుకున్నారు. ఇది పూర్వ కాలంలో జరిగిన సంగతి.

మా అక్కయ్య మా బావగారు శ్రీ కాళీ గార్డెన్స్ ఆశ్రమంలో ఉంటున్నప్పుడు మా అబ్బాయికి పెళ్ళి సంబంధాలు వస్తున్నాయిగాని కుదరటం లేదని తెలిసి మా అక్కయ్య మా బావగారిని పంపించింది బాబుగారికి అబ్బాయిని చూపించ వచ్చును తీసుకు రమ్మని. నేను అక్కడి పద్ధతి ఏమిటి? ఎలా ఉంటుంది?' అని అడిగాను. అన్నీ చెప్పారు. నాకు కూడా చూడాలనిపించింది. బాబుగారిని కాగుపాడు వచ్చినప్పుడు చూశాను తరువాత చూడలేదు. పిల్లలు చిన్నవాళ్ళు, యజమాని లేరు. కొద్ది రోజుల్లోనే అబ్బాయిని తీసుకుని వచ్చాను.

బాబుగారు ఆశ్రమంలో లేరు. ఎప్పుడు వస్తారో తెలియదు అన్నారు మేము రాగానే. అబ్బాయి బాబుగారు లేరుకదా విజయవాడ అన్నయ్యగారింటికి వెళ్ళి పొద్దుటే వస్తానని వెళ్ళాడు. ఆ సాయంత్రానికే బాబు వచ్చారు. అయ్యో అబ్బాయి లేకుండా వెళ్ళాడే అని బాధ పడ్డాను. అప్పుడు బొంబాయి మామ్మగారు "బాధ పడకమ్మా నువ్వు ప్రార్థనకి వెళ్ళు. ప్రార్థన జరుగుతుండగా బాబు వచ్చి సింహాసనం మీద కూర్చుంటారు. ప్రార్థన అయిన తరువాత బోధ చెప్తారు. నువ్విపుడు బాధ పడుతూ వెడుతున్నావు. ప్రార్థన అయిన తరువాత వచ్చేటప్పుడు నవ్వుతూ వస్తావు'' అన్నారు ధైర్యం చెప్తూ. ప్రార్థనకి వెళ్ళి కూర్చున్నాను. ఆవిడ

అన్నట్లే బాబు వచ్చి సింహాసనం మీద కూర్చున్నారు. ప్రార్థన అయిన తరువాత బోధ చెప్తూ నా వంక మూడు సార్లు చూశారు. ఆ చూపులో ఎంత మహిమ ఉందో నా బాధ అంతా తగ్గి ఎంతో ఆనందం అయింది. ఇంటికి వచ్చాక బొంబాయి మామ్మగారికి ఇలా జరిగిందని చెప్పాను. నేనన్నాను కదా అన్నారావిడ.

ఆ మరురోజు మా అబ్బాయి వచ్చాడు. మా అక్కయ్య, నేను పిల్లవాడిని తీసుకుని బాబుగారి దగ్గిరకు వెళ్ళాము. శ్రీబాబు పిల్లవాడిని చూసి అన్నారు"9 సోమవారాలు ఆవుపాలలో తెల్లజిల్లేడు పూలతో స్వామికి అభిషేకం చేయించ"మన్నారు. అప్పుడు ఆశ్రమంలో శివాలయం కట్టలేదు ఇంకాను. బాబు వద్ద సెలవు తీసుకుని మా ఊరు వెళ్ళి మా ప్రక్క ఊళ్ళో శివాలయం ఉంది అక్కడికి పంపించి 9 సోమవారాలు బాబు చెప్పినట్లు చేయించాము. తరువాత కొన్నాళ్ళకి 2,3 సంబంధాలు వచ్చాయి. బాబుగారికి వచ్చి చెప్పాము. "అవి కావు వచ్చే మే నెలలో పెళ్ళి అవుతుంది" అన్నారు. ఈ సందర్భంగా నేను రావటం జరిగింది. బాబు అన్నట్లే మే నెలలో వచ్చి చూసి వారం రోజుల్లో ముహూర్తం పెట్టి పంపించారు. శుభలేఖలు ఇచ్చి పిల్లలను పంపిచాను బాబు దగ్గరకు. అప్పుడే గురుపూజ అయి లోపలికి వెళ్ళారు. పిల్లలు సంగతి చెప్తే విని సుగుణక్క సంతోషంగా శుభలేఖ చూసి పిల్లలను జాగ్రత్తగా వెళ్ళిరండి అని ఆశీర్వదించారట.

ఆ తరువాత ఆశ్రమానికి వచ్చి నేను ఇక్కడే ఉండిపోయాను. సత్య స్వరూపులైన సద్గురుదేవులు చెప్పింది సత్యంగాక ఏమౌతుంది? జరగకపోవటం అన్నది ఎలా సంభవిస్తుంది? నమ్ముకున్నవారికి బంగారు పిచ్చుకే. అందుకే 'యోగక్షేమం వహామ్యహం' అని వాగ్దానం చేసిన సత్యమూర్తి శ్రీ జగద్గురు దేవులైన శ్రీ హనుమత్కాళీ ప్రసాద దేవులు. *

తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రపురం గ్రామంలో ది.28.1.10నుండి ది. 7.2.10 వరకు శ్రీ కనక దుర్గ అమ్మవారి గుడి,శ్రీ కోదండరామాలయ ప్రాంగణంలో జరుగుతున్న శ్రీదుర్గా కోటి కుంకుమార్చన కుంభాభిషేక సహస్ర చండీయాగంలో శ్రీ మాతాజీ 28, 29 తేదీలలో పాల్గొని తమ అనుగ్రహ భాషణం చేస్తారు.

ఫిబ్రవరి 3వ తేదీ నుండి 7వ తేదీవరకు భక్తులు శ్రీ రమణయ్యగారి నివాసము, బెంగళూరులో **యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజి వారి సత్సంగ కార్యక్రమములు** జరుగును. ప్రతి రోజు ఉదయ కార్యక్రమాలు శ్రీ రమణయ్యగారి నివాసంలో జరుగుతాయి. సాయంత్ర కార్యక్రమాలు శ్రీ కుచలాంబ సాంస్కృతిక మందిరం, రాగిగుడ్డ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన ప్రాంగణంలో జరుగుతాయి. వివరాలకు శ్రీ రమణయ్య: 9742221353 శ్రీసాయిబాబా: 9448639553




(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

సురతో నిండిన అమూల్యమైన స్వర్ణ పాత్రలతో, ఆకాశాన్ని అంటే స్తంభాలతో, పుష్పాలతో అలంకరింపబడిన ఆ మండపములో స్తబ్ధత నెలకొని ఉంది. ఆకాశంలో పయనిస్తున్న సూర్యుడు సరిగ్గా 12 గంటలప్పుడు మధురానగరాన్ని చూస్తున్నట్లుగా నిలిచిపోయాడు.

రోషంతో క్రోధంతో నిండిన కంసుని వందలాది మంది చూశారు. అతను చేసిన భయంకర గర్జన విని అందరూ భయంతో వణికి పోయారు. వారందరి దృష్టి కృష్ణుని పైనే నిలిచి ఉంది. కృష్ణుని ముఖంలో కనిపించిన భావం, మధురవాసులు ఇంతకుముందు చూచి ఉండలేదు. ఆయన వదనంలో రోషం లేదు. ఉత్తేజం లేదు. వ్యగ్రత లేదు, దుఃఖం లేదు...... ప్రేమ, కరుణ ఉట్టిపడుతున్న కమనీయమైన చిరునవ్వు.... ఇంతకుముందు ఎవ్వరూ చూచి ఉండలేదు. పెదవులపై చిందే అలాంటి మధుర హాసం. అదీ అటువంటి విషమడియలో... 'ఇది ఎలా సంభవం? అయితే ఆ నవ్వు ఎంత సేపో ఉండదు. ఇతని అంతం సమీపించింది... కంసుని పాశవిక బలం ముందు... ఈ మృదు కోమల మయూర పంకం ఎలా నిలువగల్గుతుంది' అనుకొన్నారు అక్కడ ఉన్న ప్రేక్షకులు.

ఉన్నట్లుండి కన్నులు మిరుమిట్లు గొలుపుతూ ఒక మెరుపు మెరిసింది. ఆ తేజ పుంజ ప్రకాశం అందరి కళ్ళలో నిండి ఏమీ కనిపించలేదు. వారు తమ కళ్ళను నులుముకొని చూడటానికి ప్రయత్నించారు. అంతే! వారి కళ్ళు పేలిపోతాయా అన్నట్లుగా ఒక ప్రచండమైన ధ్వని... కొందరు చూశారు... కొందరు చూడలేదు.. ఏదైతే అసంభవం అనుకొన్నారో అది సంభవించింది... కృష్ణుని చేతిలో కంసుని కేశాలు, రక్తం కక్కుతున్న మహాబలశాలి కంసుడు మండపం మధ్య, సింహాసనం క్రింద పడి కొట్టుకుంటున్నాడు. అతని బంగారు కిరీటం రక్తపుమడుగులో పడి ఉంది. అతని పొడుగాటి కేశాలను చేతిలో పట్టుకొని కృష్ణుడు అతని దేహాన్ని ఈడుస్తున్నాడు. ఎటువంటి అనూహ్యమైన దృశ్యం అది! కంసుని నోటినుండి నురగలు వస్తున్నాయి. దేహం ముడుచుకు

పోయింది. అంతవరకు మెడను అలంకరించిన రత్నహారాలు నాలుగు వైపులా చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. సముద్రంలో తుఫాను కెరటాల వలె సభా మండపంలో కలకలం. ఒక గడియముందే పర్వతంలా విశాలమైన కువలయాపీడం అనే ఏనుగును దాని దంతంతోనే చీలుస్తున్న కృష్ణుని చూసినవారికి ఈ భయానక దృశ్యం చూడగానే వారి రోమాలు నిక్కబొడుచు కున్నాయి. ఒక పెద్ద వటవృక్షం ముందు మొలిచిన తులసి మొక్కవలె భూమిపైన క్షతగాత్రుడైన కంసుని ప్రక్కన కృష్ణుడు నిలిచి ఉన్నాడు. అంతఃపుర గవాక్షాల నుంచి స్త్రీల రోదనలు మిన్ను ముట్టాయి.

"మామా....!" కృష్ణుడు ఒంగొని కంసుని చెవి దగ్గర ముఖం పెట్టి పిలిచాడు. కృష్ణుని మయూర పింఛం కంసుని కపోలాన్ని స్పృశిస్తోంది. ఆ స్పర్శకు కంసుని స్పందన అతని కళ్ళలో ప్రకటితమైంది.

"నియతి యొక్క ప్రణాళికలో నేను నిమిత్త మాత్రుణ్ణి మామా! రాగ ద్వేషాలను ఇక్కడే వదలి మీరు పరమ ప్రాప్తికోసం సుఖ పూర్వకమైన యాత్రను ప్రారంభించండి."

"కృష్ణా..." కంసుని స్వరం పిలిచింది. అది మృత్యుముఖంలో ఉన్న పిలుపు. ఆ పిలుపు విన్న వారంతా కృష్ణుని విజయానికి జయ జయ ధ్వానాలు చేశారు. వెంటనే నిశ్శబ్దం... కంసుడు ఇంకా జీవించే ఉన్నాడు. "మాతృపక్షం శ్వశుర పక్షం - ఈ రెండు పితృ పక్షాలలాగ అర్ఘ్యాదులకు తర్పణాలకు సమాన అధికారి అవుతుంది మామా! అది తెలిసి కూడా అనివార్యమైన దానికి నేను నిమిత్తమాత్రుణ్ణి కావాల్సి వచ్చింది" అన్నాడు కృష్ణుడు.

'సృష్టి యొక్క నిర్మాణం ఇక్కడ పూర్తి అయింది కృష్ణా!' అన్నాడు కంసుడు ఒగురుస్తూ. "ఈ సృష్టి తంత్రంలో జయము, పరాజయము రెండూ అనివార్యాలే. ఈ సత్యం ఎరుగని వాడను కాను నేను.... కాని...'

"నిస్సంకోచంగా చెప్పండి మామా..." అన్నాడు కృష్ణుడు స్నేహపూర్వకంగా.

- సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,